
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 18 మార్చి 2024 | 5



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సోమ) సా.6.22
సహరి(మంగళ) ఉ.4.48

ఎండా కాలమ్
	గరిష్టం	కనిష్టం
రాజమండ్రి	37.0	24.0

గ్రూప్-1కు 8258 మంది

రాజమహేంద్రవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం జిల్లావ్యాప్తంగా 25 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 8,258 మంది దరఖాస్తు చేసుకోగా ఉదయం జరిగిన పేపర్-1కి 5,056 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం పేపర్-2కి 5,007 మంది హాజరయ్యారు. ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల, ఆదికవి నన్నయ యూనివర్సిటీ లోని పరీక్షా కేంద్రాలను జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ తనిఖీ చేశారు. సదుపాయాలపై ఆరా తీశారు. డీఆర్వో జి.నరసింహులు, రాజమహేంద్రవరం ఆర్డీవో ఎ.చైత్ర వర్షిణి పలు కేంద్రాలను పరిశీలించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేశారు. అక్కడక్కడా విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి ఇబ్బందిపడినా సమయానికి మాత్రం పరీక్షకు హాజరయ్యారు. ఎక్కడెక్కడి నుంచో అభ్యర్థులు తరలిరావడంతో ఆటోలకు డిమాండ్ ఏర్పడింది.


గ్రూప్-1 పరీక్షను తనిఖీ చేస్తున్న జేసీ తేజ్‌భరత్

నేటి నుంచి 'పది' పరీక్షలు

రాజమహేంద్రవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. జిల్లావ్యాప్తంగా పరీక్షలకు 29,990 మంది విద్యార్థులు హాజరవుతారు. ఈ మేరకు 137 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. ఉదయం 8.45 గంటల నుంచి 9.30 గంటల వరకూ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఉదయం 10 గంటల తర్వాత అనుమతి ఉండదు. పిల్లలు ఎక్కడా ఇబ్బంది పడకుండా కలెక్టర్ ఆదేశాలతో ఏర్పాట్లు చేశామని, ఒత్తిడికి గురవ్వకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా పాఠశాల విద్య అధికారి వాసుదేవరావు సూచించారు. పరీక్షా సమయానికి అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. 10వ తరగతి విద్యార్థులు పరీక్ష తేదీల్లో నివాస గ్రామం నుంచి పరీక్షా కేంద్రానికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. విద్యార్థులు బస్సు కండక్టర్లకు తమ హాల్ టిక్కెట్లు చూపించాలి. ఈనెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ మాత్రమే ఇది వర్తిస్తుంది.


పరీక్షకు సంబంధించి బెంచీలపై హాల్‌టికెట్ నెంబర్లను పరిశీలిస్తున్న సిబ్బంది

నేటి నుంచి ఒంటిపూట బడులు

రాజమహేంద్రవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సోమవారం(నేడు) నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. పది పరీక్షలు కూడా ఇదే రోజు నుంచి మొదలు కావడంతో పరీక్షా కేంద్రాలు ఉన్న స్కూల్స్ ఒంటిపూట బడుల సమయాలను పరీక్షలు ముగిసే వరకూ మార్పు చేశారు. పరీక్షా కేంద్రం లేని స్కూల్స్‌లో ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ, పరీక్షా కేంద్రం ఉన్న చోట మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకూ తరగతులు నిర్వహిస్తారని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి వాసుదేవ రావు తెలిపారు. పది పరీక్షలు ముగిసిన మరుసటి రోజు నుంచి ఆయా స్కూల్స్‌లో కూడా ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ తరగతులు నడుస్తాయన్నారు. ఏప్రిల్ 23 వరకూ ఒంటి పూటబడులు ఉంటాయని పేర్కొన్నారు.

కోట సత్తెమ్మకు విశేష పూజలు



నిడదవోలు, మార్చి 17 : తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో ఆదివారం విశేష పూజలు చేశారు.ఐ అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహానివేదన చేశారు. అమ్మవారికి ఇష్టమైన రోజు కావ డంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.ఆదివారం అమ్మ వారికి రూ.1,39,573లు ఆదాయం లభించినట్టు కార్య నిర్వహణాధికారి వి.హరి సూర్య ప్రకాష్ తెలిపారు.



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

అంతా జగన్మాయ.. అనుకున్నది అనుకున్నట్టు జరిగితే అందులో వింతేముంది..చివరికి ఎన్నికల షెడ్యూల్ విషయంలో కూడా అదే జరిగింది. ఎన్నికలు 40 రోజుల్లో జరిగిపోతాయని అంతా భావించారు.అయితే రాజకీయ నాయకుల లెక్క మారింది.. ఎన్నికల షెడ్యూల్ వచ్చింది సరే. పోలింగ్ తేదీకి సుమారు రెండు నెలలు గడువు ఉండడంతో బాబోయ్ ఇన్ని రోజులా అని రాజకీయ పార్టీలు అభ్యర్థుల్లో గుబులు మొదలైంది.ప్రస్తుతం ఎన్నికలంటే ఖర్చుతో కూడుకున్నపని. విస్తృత ప్రచారం చేయాలి.. రెండు నెలల పాటు ఓటర్ల చుట్టూ తిరగాలి.. దానికి మందీ మార్బలం ఉండాలి.. డబ్బులేనిదే ఎవరైనా తిరుగుతారా.. అంతా డబ్బుతోనే పని. ప్రచా రానికి అవసరమైన సరంజామా ఏర్పాటు చేసుకోవాలి. కార్యకర్తలు, ప్రచారం చేసేవారు కావాలి. ప్రతీ ఊళ్లలోనూ ప్రచారం చేసేవారు కావాలి. ఎన్నికల కార్యాలయాలు ఏర్పాటు చేయాలి. వాటిని నిర్వహించేవారు కావాలి. ప్రచార రథాలు, ఇతర వాహనాలు అవసరం. ఓటర్ల కోసం ఇంటింటా సర్వే కూడా చేస్తుంటారు. ఈ సర్వే కోసం పెద్ద టీమ్ అవసరం. జిల్లాలో ఒక నియోజకవర్గంలో కేవలం ఇంటింట ఓటర్ల సర్వే చేసి పార్టీ మ్యానిఫెస్టో కరపత్రాలు, బ్యాడ్జిలు, స్టిక్కర్లు ఇవ్వడానికి 1200 మంది యువకులను ఏర్పాటు ఏర్పాటు చేశారు. నిత్యం వారి మంచిచెడ్డలు చూడాలి. ఇటీవల గ్రామాల్లో పెడుతున్న మీటింగ్‌లకు డబ్బులు ఇవ్వాల్సి వస్తోంది. రెండు మూడు గంటలు ఉండడానికి కనీసం రూ.150 నుంచి రూ.200 వరకూ ఇస్తున్నారు. గతంలో అయితే నాయకులు ఎక్కడైనా సభ పెడితే స్వచ్ఛందంగా వచ్చేవారు 70 శాతం మంది ఉండేవారు. మరో 30 శాతం మందిని తెచ్చుకునేవారు. అయితే ప్రస్తుతం వంద శాతం డబ్బుతోనే పని.. కేవలం 10 శాతం మంది మాత్రమే స్వచ్ఛందంగా తరలివస్తున్నట్టు సమాచారం.ఓటరు దగ్గరకు వెళ్లినప్పుడు అభ్యర్థి ఒక్కరే వెళితే బాగోదు.. అట్టహాసానికి 20 మంది అయినా వెంట ఉండాలి.. వారి ఖర్చులు బాగోగులు అంతా అభ్యర్థి జేబు నుంచే రావాలి.. వెంట తిరిగేవారి పెట్రోల్ ఖర్చులు..భోజనాలు.. ఇలా అనేక సమస్యలు ఉంటాయి. అన్నీ పోను అన్ని వర్గాలను ఆకట్టుకోవాలి. వారిలో పలుకుబడి ఉన్నవారిని, పార్టీ కోసం పనిచేసే వారి ఆలనాపాలనా కూడా చూస్తుండాలి. ఇలా రోజుకే రూ.లక్షల్లో ఖర్చు ఉంటుంది. ఈ నెల 16వ తేదీన ఎన్నికల షెడ్యూల్ వచ్చింది.వచ్చే నెల 18వ తేదీన నోటిఫికేషన్ జారీ అవుతుంది. అప్పటి నుంచే అసలు ఘట్టం మొదలవుతుంది. నామినేషన్లు మొదలు. మే 13న పోలింగ్ జరుగుతుంది. వీటి మధ్య సుమారు 56 రోజుల సమయం ఉంది. బాగా ప్రచారం చేసుకోవాలి, ప్రతీ ఓటరును కలవాలని, ప్రతి సమస్య తెలుసుకోవాలి, తమ పార్టీ మేనిఫెస్టోని ప్రతీ అంశం ఓటరు వద్దకు చేరాలని భావించే వారికి ఈ సమయం చాలా సంతోషకరంగా ఉంటుంది. ఖర్చు మాత్రం మరింత భారం అవుతుంది.

- మే 13న ఎన్నికల పోలింగ్
- సుమారు రెండు నెలల గ్యాప్
- అయోమయంలో అభ్యర్థులు
- ఖర్చు పెరిగిపోతోందని టెన్షన్
- ఎన్నికల ప్రచారానికి రెడీ
- మరో పక్క ఎండ దెబ్బ
- ఎన్నికల వరకు 'స్పందన'కు బ్రేక్

అభ్యర్థులకు తప్పదు ఎండదెబ్బ

ఇప్పటికే ఎండలు మండిపోతున్నాయి.ఈ ఏడాది ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరిక చేసింది. ఈ నేపథ్యంలో ఇంకా పెరిగే అవకాశం ఉంది.అంటే ఎన్నికల సమయానికి ఎండ ముదిరిపోతోంది.దీంతో ఏప్రిల్,మేనెలలో వడదెబ్బ ఉంటుంది.ఆ సమయంలో ఇబ్బందులు ఉంటాయి.ఎండ వల్ల జనం తిరగడానికి మరిన్ని సౌక ర్యాలు కల్పించాల్సి ఉంటుంది.చెమటలు కక్కుకుంటూ ప్రచారం చేయడం ఎన్నికల సమయంలో మామూలే. కాళ్లు బొబ్బ లు వచ్చినా నడక మానరు.దీంతో ఎండ వల్ల ఇబ్బందులు తప్పవు.

వలంటీర్లకు బ్రేక్.. వైసీపీకి షాక్

వలంటీర్లతో పబ్బంగడుపుకోవాలని చూసిన వైసీపీ గుండెల్లో బాకు దిగింది. ఎన్నికల కమిషనన్ వలంటీర్లను ఎన్నికల డ్యూటీలకు దూరంగా ఉంచాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. దీంతో వైసీపీ కంగారు పడుతోంది. ఇప్పటికే అనవసరంగా వలంటీర్లకు సన్మానాలు చేశాం. అవార్డులు ఇచ్చాం. చివరికి ఇటీవల గిఫ్టులు కూడా ఇచ్చామే అని వైసీపీ నేతలు వాపోతున్నారు.జిల్లాలో 9300 మంది వలంటీర్ల పోస్టులు ఉండగా, ప్రస్తుతం 8వేల మంది విధుల్లో ఉన్నారు.ఇటీవల జీతం పెంచాలని కోరినందుకు కొందరు వలంటీర్లను తొలగించిన సంగతి తెలిసిందే. ఈ బాధ వలంటీర్లందరిలోనూ ఉంది.

ఎన్నికల వేళ 'స్పందన' రద్దు

సార్వత్రిక ఎన్నికల షెడ్యూ ల్ విడుదల చేసిన కారణంగా ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ లోనూ, జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లోనూ జరిగే స్పందన కార్యక్రమం రద్దయినట్టు జిలా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లాకలెక్టర్ డా. కె.మాధవీలత తెలి పారు. ఇప్పటి వరకూ స్పందన కార్యక్రమం కింద జిల్లా ,డివిజన్, మండల , గ్రామ సచివాలయ స్థాయిల్లో ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరిస్తున్న సంగతి తెలిసిందే. ఇక రద్దయిందని.. ఎన్నికలు ముగిసే వరకూ స్పందని ఉండ దని ప్రజలు గమనించాలన్నారు.

నియమావళి కచ్చితంగా పాటించాలి
జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత

రాజమహేంద్రవరం, మార్చి17(ఆంధ్రజ్యోతి) : కోడ్ అమల్లో ఉన్నందున నియమావళిని కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డా. కె.మాధవీలత ఆదేశించారు. జిల్లాలో ఇంకా కొన్ని ప్రాంతాల్లో హోర్డింగ్‌లు, పోస్టర్లు, కటవుట్‌లు తొలగించ లేని విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. 24 గంటల్లో అమలు చేయవలసిన పనులు, 48 గంటల్లో చేయవలసిన పనులు, 72 గంటల్లో చేయవలసిన పనుల ప్రకారం తక్షణం తొలగింపు చర్యలు తీసుకుని నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వెలగపూడి నుంచి ఆదివారం ఏపీ ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం జిల్లాలోని నియోజకవర్గ రిటర్నింగ్ అధికార్లతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు(ఎఫ్ఎస్) ఎన్నికల నిర్బంధ నిర్వహణ వ్యవస్థ (ఈఎస్ఎంఎస్) పూర్తి స్థాయిలో విధుల్లో భాగస్వాములు కావాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో తనిఖీలకు క్షేత్రస్థాయిలో బాధ్యతలు నిర్వహించే సిబ్బందికి మెజిస్ట్రియల్ అధికారాలకు ప్రతిపాదనలు పంపాలన్నారు. సీ-విజిల్ ద్వారా వచ్చిన ఫిర్యాదుకు 100 నిమిషాల్లో ప్రతి స్పందన ఉండాలన్నారు. వీటిపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యక్ష పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి వివరాలూ, ఎక్కడ నుంచి ఫిర్యాదు వచ్చిందనే సమాచారం పూర్తిగా ఉంటాయని, అక్కడికి సంబంధిత ఫంక్షనరీ యూనిట్(ఎఫ్‌యు) చేరుకుని అక్కడి వివరాలు యాప్ ద్వారా నివేదిక సమర్పించాలన్నారు. నియోజకవర్గాల వారీ కౌం టింగ్ రూమ్‌లు, తదితర అంశాల్లో ఏమైనా పెండింగ్ ఉంటే వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ కె.దినేష్‌కుమార్, డీఆర్వో జి.నర సింహులు,రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ ఈఆర్వో ఆర్.కృష్ణానాయక్, డీటీ సునీల్ పాల్గొన్నారు.

బైక్ మీది.. పెట్రోల్ మాది..



ఎన్నికల షెడ్యూల్ అలా విడుదలైందో లేదో నాయకులు ఇలా రోడ్డెక్కేస్తున్నారు.. ఎక్కడా ఖర్చుకు వెనకడుగు వేయడం లేదు.. ఏకంగా 56 రోజులు ఇదే తీరుగా ఉంటుంది. నిడదవోలు మండలం కోరుమామిడి నుంచి విజ్జేశ్వరం వరకు ఆదివారం ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో వైసీపీ బైక్ ర్యాలి నిర్వహించింది. ఈ బైక్ ర్యాలీకి బైక్‌లు తెచ్చుకున్న వాళ్లందరికి ఒక్కొక్కరికి రెండు వందల రూపాయిల పెట్రోల్ పోయించి ర్యాలీ నిర్వహించినట్టు సమాచారం. బైక్ ర్యాలీ అనుమతులపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమణ నాయక్‌ను వివరణ కోరగా ఈ బైక్ ర్యాలీకి 100 బైక్‌లు, 100 జెండాలు, ఒక ప్రచార రథానికి అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఈ బైక్ ర్యాలి మొత్తాన్ని వీడియో సర్వలెన్స్ టీమ్ రికార్డు చేసిందని ఈ ఖర్చు అంతా శ్రీనివాస్ నాయుడు ఎన్నికల ఖర్చులో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. - **నిడదవోలు**

అంబులెన్స్‌లు మూలకు


దుమ్ము పట్టి ఉన్న కాన్వాయ్ అంబులెన్స్

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 17 : అత్యవసర వైద్య సమయంలో రోగులు, ఇతర బాధితులను ఆసుపత్రులకు తరలించడానికి సంజీవనిలా ఉపయోగపడే ప్రాణరక్షలు (అంబులెన్సులు)ను రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో పక్కనబెట్టేశారు. దాదాపు నిరుపయోగంగా మార్చేశారు. దీంతో కాకినాడ జీజీహెచ్‌కు రిఫరల్‌తో సహా ఇతర వైద్యపరమైన అన్ని సేవలకూ 108 వాహనాలనే ఉపయోగిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు చెందిన కొన్ని అంబులెన్సులు తుప్పుపట్టి స్ర్కాప్‌గా మారిపోతున్నాయి.

నీరుగారుతున్న దాతల ఆశయం

రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో మూడు అంబులెన్సులు ఉండగా .. వీటిలో గతంలో ఎంపీ (రాజ్యసభ సభ్యుడు) సురేష్‌ప్రభు తన ఎంపీ ల్యాడ్స్‌తో సమకూర్చిన ఒక అంబులెన్సుతో పాటు రాజమండ్రి మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్ తన నియోజకవర్గ అభివృద్ధి నిధులతో అందజేసిన మరో అంబులెన్సు, ట్రామాకేర్‌కు చెందిన ఒక అంబులెన్సు ఉన్నాయి. మొత్తం మూడు అంబులెన్సులు జీజీహెచ్‌కు చెందినవే అయినా ఇవన్నీ దాదాపు నిరుపయోగంగానే ఉన్నాయి. వీటిలో సురేష్‌ప్రభు సమకూర్చిన అంబులెన్సు ఒక్కటే అప్పుడప్పుడూ వినియోగిస్తున్నారు. దీన్ని సీఎం, ప్రతిపక్ష నేత, ఇతర రాజకీయ ప్రముఖుల (వీఐపీలు) పర్యటనల సమయంలో కాన్వాయ్‌కు, కాకినాడ సెంట్రల్ డ్రగ్‌స్టోర్ నుంచి జీజీహెచ్‌కు మందులు తీసుకురావడానికి ఉపయోగిస్తున్నారు. ట్రామాకేర్ అంబులెన్స్‌ను అప్పుడప్పుడూ వాడుతున్నా పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేలేదు. ఇక ఎంపీ మాగంటి మురళీమోహన్ సమకూర్చిన అంబులెన్స్‌ను పూర్తిగా మూలనపడేశారు. మెయింటెనెన్స్ చేయకుండా ఇలా కొన్నాళ్లు వదిలేస్తే స్ర్కాప్‌గా మారిపోయే ప్రమాదం ఉన్నా జీజీహెచ్ అధికారులు వీటి గురించి పట్టించుకున్న పాపాన పోవడంలేదు. అంబులెన్సులను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురాలేకపోవడంతో అంబులెన్సుల డ్రైవర్లకు పెద్దగా పని ఉండడంలేదు. జీజీహెచ్ అధికారులు వీరిని ఇతర అవసరాలకు వాడుకుంటున్నారు.

- తుప్పుపట్టిపోతున్న అంబులెన్స్‌లు
- మూలకు మూడు ప్రాణరక్షలు
- పనిచేస్తున్నా వినియోగించని వైనం
- మురళీమోహన్ అంబులెన్స్ పరిస్థితి ఇంతే
- జిల్లా ఆసుపత్రిలో పట్టించుకోని అధికారులు
- అత్యవసరంలో అందక రోగుల ఇక్కట్లు
- నెరవేరని దాతల ఆశయం


అమలాపురం అంబులెన్స్

అమలాపురంది ఇక్కడెందుకు..

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఏరియా ఆసుపత్రికి చెందిన అంబులెన్సు గత కొన్నేళ్లుగా జీజీహెచ్ ఆవరణలో వదిలేశారు. పోలీస్ అవుట్‌పోస్టు సమీపంలో ఎండకు ఎండి, వానకు తడుస్తున్న చందంగా ఉంది దీని పరిస్థితి. టైర్లు, ఇతర పరికరాలు దాదాపుగా శిథిలావస్థకు చేరుతున్నాయి. కొన్నాళ్లు పోతే ఈ అంబులెన్సు రూపురేఖలు పూర్తిగా మారిపోయి స్ర్కాప్‌కు చేరే ప్రమాదం ఉంది. దీన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రికి ఇచ్చేయకుండా ఇక్కడే ఎందుకు ఉంచుతున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం అన్ని సేవలకూ ప్రైవేట్ సంస్థ నిర్వహణలోని 108 అంబులెన్సులనే ఉపయోగిస్తున్నందున జీజీహెచ్ ఆస్తులుగా ఉన్న సొంత అంబులెన్స్‌లను పరిరక్షించుకోలేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


రాజమహేంద్రవరం టీటీడీ కల్యాణ మండపం వద్ద ఇలా..

ఇవి కనిపించలేదా సార్!

రాజమహేంద్రవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి)/అనపర్తి: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు ఆరంభమైపోయాయి. శనివారం సాయంత్రం 3గంటల సమయంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. వెంటనే 24 గంటల్లో, 48 గంటల్లో, 72గంటల్లో జరగాల్సిన పనులను నిర్దేశిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులిచ్చింది. వాటి ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ పార్టీలు/రాజకీయ నాయకుల హోర్డింగ్‌లు, పోస్టర్లు, కటౌట్లు 24గంటల్లో తొలగించాల్సి ఉంటుంది. ఇదే విషయాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా కూడా ఆదివారం జిల్లా కలెక్టర్లతో వర్చువల్ విధానంలో జరిగిన సమావేశంలో స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం 3 గంటల్లోగా ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగింపులు జరగాలని ఆదేశించారు. కానీ బాధ్యతాయుతంగా ఉండాల్సిన అధికార పార్టీ మాత్రం ఉల్లంఘనలను మొదలు పెట్టేసింది. జిల్లా కేంద్రంలోనూ జగన్ తదితర వైసీపీ నాయకులతో ఉన్న ఫ్లెక్సీలు ఆదివారం రాత్రి కూడా దర్శనమిచ్చాయి. శ్యామలాసెంటర్ సమీపంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు బ్రాంచి నిర్మాణం జరుగుతోంది. ఇక్కడ జగన్ చిత్రంతో బోర్డు ఏర్పాటు చేశారు. ఆ పక్కనే మరో ఫ్లెక్సీలో సిట్టింగ్ ఎంపీ భరత్‌రామ్ బొమ్మ కూడా ఉంది. ఇవి ఒకటి బ్రాంచి మేనేజర్, నోడల్ ఆఫీసర్ పేరున, మరొకటి బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి పేరున ఉన్నాయి. అలాగే ఉమెన్స్ కళాశాల దగ్గరలోని జంక్షనులో ఓ ప్రభుత్వ భవనానికి అమర్చిన జగన్ చిత్రాలు ఉన్న పెద్ద హోర్డింగులను తొలగించలేదు. ఈ రెండు ప్రాంతాలూ ఎప్పుడూ రద్దీగా ఉంటాయి. దీంతో ఇక్కడ ఈ పోస్టర్లు అటు అధికారులకు, ఇటు వైసీపీ నాయకులకు కానరాకపోవడంపై జనాలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తొలగించే వరకూ అధికార పార్టీ నాయకులకు బాధ్యత లేదా? అని ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గ కేంద్రమైన అనపర్తిలో అనేక చోట్ల రాజకీయ పార్టీల నేతల పటాలు దర్శనమిస్తున్నాయి. అనపర్తి మెయిన్‌రోడ్డులో వీధికి ఏర్పాటు చేసిన ఆర్చిలో కింద ఉన్న నేతల ఫొటోలను కప్పి పైవరుసలో ఉన్న ఫొటోలను వదిలివేశారు.


రాజమహేంద్రవరం డీసీసీబీ బ్యాంక్ వద్ద ఫ్లెక్సీలు


అనపర్తి మెయిన్‌రోడ్డులో ఆర్చిపై ఉన్న ఫొటోలు

ప్రజాగళం.. ప్రభంజనం


తొడగొడుతున్న యువతి..


పల్నాడు జిల్లా బొప్పూడి ప్రజాగళం సభకు హాజరైన జనం


ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, మోదీ, పవన్



ప్రజాగళం సభకు వస్తున్న అమరావతి మహిళలు




ప్రజాగళం సభలో మూడు పార్టీల అభిమానులు



జనం జనం ప్రభంజనం.. బొప్పూడి ప్రజాగళం జనసంద్రమైంది. ఆదివారం భానుడు భగభగ మండిస్తున్నా తగ్గేదిలేదన్నట్లుగా తరలివచ్చిన అశేష జనం హర్షాతిరేకాలతో బొప్పూడి సభా ప్రాంగణం దద్దరిల్లింది. బొప్పూడికి ఇటు చిలకలూరిపేట, అటు మార్టూరు వరకు 16వ నెంబరు జాతీయ రహదారి జనంతో నిండిపోయింది. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొప్పూడి వైపు కదలిరావడంతో జాతీయ రహదారిపై జన సునామీ ఆవిష్కృతమైంది. చలో బొప్పూడి అంటూ కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలిరావడంతో మధ్యాహ్నం మూడు గంటలకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిటకిటలాడింది. జనసునామీని చూసిన అధినేతలు ఆనందపరవశులయ్యారు. మోదీ అయితే చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. బొప్పూడి వేదికగా త్రిమూర్తులైన ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించారు. అభివృద్ధి లేక అప్పులు.. దోపిడీ దాష్టీకాలు.. అవినీతి అప్రజాస్వామిక పాలనను అంతం పలకాలని నేతలు పిలిపిచ్చారు. జెండాలు వేరైనా అజెండా ఒకటేనని.. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే కూటమికి ఓటేసి ఆశలు, ఆకాంక్షలు, సాకారం చేసుకోవాలని సందేశమిచ్చారు. - చిలకలూరిపేట


ఉత్సాహంగా యువతులు..


బాబు,పవన్, పురందేశ్వరి అభివాదం...


మోదీతో బాబు మాటామంతీ..


జానపదుల నృత్యాలు..


మహిళలు, కార్యకర్తల ఉత్సాహం...





వాడపల్లిలో ఘనంగా స్వర్ణ శిఖర ప్రతిష్ఠ



ఆత్రేయపురం, మార్చి 17: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వర్ణ శిఖర ప్రతిష్ఠ ఆదివారం కన్నుల పండువగా జరిగింది. శ్రీవారి ఆలయంతో పాటు క్షేత్ర పాలకులైన అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, మహాలక్ష్మి అమ్మవారి ఉపాలయాలకు స్వర్ణ కలశ ప్రతిష్ఠ జరిగింది. వైఖానస ఆగమం ప్రకారం ఖండవల్లి వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో ఉదయం 10.22 గంటలకు వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు భక్తుల గోవింద నామస్మరణ మధ్య నిర్వహించారు. ప్రధాన హోమం, మహా పూర్ణాహుతి, స్వామివారికి జీవకళావాహన, పుష్కర నదీ జలాలతో అభిషేకం, వేదాశీర్వచనం జరిపారు. కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సహకారంతో రూ.35 లక్షల వ్యయ దాతలు తాడి నాగమోహనరెడ్డి, మేడపాటి సిద్ధార్థరెడ్డి, చిర్ల వాసురెడ్డి, ధర్మకర్త పి.సురేష్‌రాజు, ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతి రాజు కిశోర్‌కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్నారు. వేలాది మంది భక్తులు తిలకించి తన్మయత్వం పొందారు.



శిఖర ప్రతిష్ఠకు తరలివచ్చిన భక్తులు

202 కిలోల గంజాయి పట్టివేత


గంజాయి నిందితులతో పోలీసులు

రావులపాలెం, మార్చి17: జాతీయ రహదారిపై వాహనంలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. రావులపాలెం పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ట్రైనీ డీఎస్పీ విష్ణుస్వరూప్ వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఈతకోట జాతీయ రహదారిపై ట్రైనీ డీఎస్పీ విష్ణుస్వరూప్, ఎస్‌ఐలు ఎం.ప్రేమ్‌కుమార్, జ్వాలాసాగర్ కానిస్టేబుళ్లు పి.విజయకుమార్, గోపి, త్రిమూర్తులు, శ్రీనివాస్‌లతో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. రావులపాలెం నుంచి తణుకు వైపు వెళ్తున్న ఏపీ 02 ఏడీ 3887 మహేంద్ర జైలో వాహనాన్ని ఆపి చూడగా అందులో గంజాయి ఉన్నట్టు గుర్తించారు. గంజాయి, కారు, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఒడిసా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా కెందుగూడ గ్రామానికి చెందిన దమా కొంతేరి, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కుంహరాస్ గ్రామానికి చెందిన సతీష్‌విశ్వాస్ 202 కిలోల గంజాయి తరలిస్తున్నట్టు నిర్ధారించారు. గంజాయి విలువ రూ.10 లక్షలు, వాహనం విలువ రూ.2.50 లక్షలుగా పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు


విజేతకు షీల్డ్ అందిస్తున్న ఎంపీ వంగా గీత

పిఠాపురం రూరల్, మార్చి 17: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు గ్రామంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్లపరుగు పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. పోటీలను తిలకించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో పోటీలు జరిగాయి. విజేతలకు కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ షీల్డులు బహుకరించారు. సీనియర్స్ విభాగంలో అనకాపల్లి జిల్లా లెక్కలవాని పాలానికి చెందిన పైడితల్లి అమ్మ తల్లికి చెందిన ఎడ్లజత నిర్దేశించిన దూరాన్ని 6 నిమిషాల 21 సెకన్ల సమయంలో పరుగెత్తి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, మండపేట వేగుళ్ల తేజ ఎడ్ల జత 6-33-15 సమయంలో, గుమ్మిలేరు కోరా వీర వెంకట సత్యవేణి ఎడ్లజత 6-37-69 సమయంలో పరుగెత్తి ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. జూనియర్స్ విభాగంలో గుమ్మిలేరుకు చెందిన కోరా వీరవెంకట సత్యవేణి ఎడ్లజత 4-36-28 సమయంలో, యర్రంపాలెంకు చెందిన ఇజ్జిన శ్రీను ఎడ్లజత 4-37-56, కొప్పవరం బండారు శ్రీను మెమోరియల్ ఎడ్లజత నిర్దేశిత దూరాన్ని 4-38-13 సమయంలో పరుగెత్తి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి.

బొలెరో వ్యాన్ ఢీకొని ఇద్దరు యువకుల మృతి


వెంకటేష్ మృతదేహం


ముత్తా హరిసాయి


పొలిమేరు వెంకటేష్

కిర్లంపూడి, మార్చి17: బొలెరో వ్యాన్ ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రాజుపాలెంలో ఈ విషాదకర సంఘటన జరిగింది. కిర్లంపూడి ఎస్‌ఐ జబీర్ తెలిపిన వివరాలు ప్రకారం... ఆదివారం సామర్లకోట నుంచి కిర్లంపూడికి బైక్‌పై కిర్లంపూడి రమణయ్యపేటకు చెందిన వార్డు మెంబర్ ముత్తా పెదకాపు రెండో కుమారుడు హరిసాయివెంకటఅప్పారావు(20), జగపతినగరం కొత్తపేటకు చెందిన పొలిమేరు వెంకటేష్(20) వస్తున్నారు. వారు రాజుపాలెం వచ్చేసరికి బొలెరా వ్యాన్ ఢీకొట్టడంతో వెంకటేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. హరిసాయిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ జబీర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇద్దరు యువకులు మృతి చెందడంతో ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ఆస్పత్రికి తరలించి ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌లను ఢీకొన్న కారు: యువకుడి మృతి


గంగాధర్ ఫైల్‌ఫొటో

ప్రత్తిపాడు, మార్చి17: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు- ధర్మవరం జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒక యువకుడు మృతిచెందగా మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి గ్రామానికి చెందిన తాడి గంగాధర్(నవీన్)(29), తాడి రాజేష్, గుడాల సురేష్ ఒక బైక్‌పైన, గొల్లప్రోలు మండలం వెల్దుర్తికి చెందిన అన్నదమ్ములు ములికి సత్యనారాయణ, ములికి ఉమాశంకర్ మరో బైక్‌పైన ప్రత్తిపాడు వస్తుండగా తిరుమల రెస్టారెంట్ వద్ద విజయవాడ వెళుతున్న కారు రెండు బైక్‌లను ఢీకొంది. ఈ దుర్ఘటనలో తాడి గంగాధర్ మృతి చెందగా మిగిలిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.

ఇల్లు కట్టుకుందామని వచ్చి

హైదరాబాద్‌లో మందుల కంపెనీలో పని చేస్తున్న తాడి గంగాధర్ (నవీన్) తన స్వగ్రామం ఉత్తరకంచిలో ఇల్లు నిర్మించుకుందామని వచ్చి రోడ్డు ప్రమాదంలో మృత్యువాడ పడ్డాడు. గంగాధర్‌కు భార్య సుధారాణి, పిల్లలు ఉన్నారు. కుటుంబానికి ప్రధాన ఆధారమైన గంగాధర్ ఇలా మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులు షాక్‌కు గురై పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారు.

మరో ప్రమాదంలో

ధర్మవరం పాడికాలువ వద్ద జాతీయ రహదారిపై ధర్మవరం నుంచి కత్తిపూడి వైపు బైక్‌పై వెళుతున్న బి.లక్ష్మి, బి. రాజేష్, బి. వైష్ణవిని లారీ ఢీకొంది. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స కోసం అంబులెన్స్‌లో స్థానిక ఆస్పత్రికి తరలించారు.

ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దుల్లో తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ఎటపాక, ఏప్రిల్ 17 సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన కన్నాయి గూడెం వద్ద ఆదివారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి ఏపీ మీదుగా రాకపోకలు సాగించే వాహనాలతో పాటు తెలంగాణ నుంచి ఛత్తీస్‌గఢ్ వైపు వెళ్లే వాహనాలను సీఐ రామారావు, ఎస్‌ఐ పార్థసారథి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మద్యం, నగదు తరలిస్తున్నారనే దానిపై సోదాలు జరిపారు. అనుమానిత వ్యక్తులను ప్రశ్నించారు. నెల్లిపాక వద్ద హైవేపై అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన


లక్ష కుంకుమార్చన పూజ నిర్వహిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు రూరల్, మార్చి 17: గొల్లప్రోలు మండలంలోని తాటిపర్తి గ్రామంలో వేంచేసి ఉన్న అపర్ణాదేవికి ఆదివారం లక్ష కుంకుమార్చన వైభవంగా జరిగింది. అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. కుంకుమార్చనకు మహిళా భక్తులు విశేషంగా తరలివచ్చారు. వేద పండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రి పూజాది కార్యక్రమాలు జరిపించారు. ఉదయం సూర్యనారాయణమూర్తికి అభిషేకం, అర్చన నిర్వహించారు. కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి రాగి డాలర్, శేషవస్త్రం, పూజా కుంకుమ, ప్రసాదం అందజేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం లలితా సహస్ర హోమం, మహా సౌరహోమం ఘనంగా జరిగింది. కాగా స్వామి, అమ్మవార్లను పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గారపాటి బుజ్జి, ప్రధాన కార్యవర్గ సభ్యుడు దానం వెంకటేష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గోదావరిలో మునిగి పారిశుధ్య కార్మికుడి మృతి


నవీన్‌సాగర్

రాజమహేంద్రవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ గోదావరిలో మునిగి ఓ పారిశుధ్య కార్మికుడు దుర్మరణం చెందాడు. రాజ మహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న తాడితోట రెల్లిపేటకు చెందిన నిమ్మకాయల నవీన్ సాగర్(35) ఆదివారం సాయంత్రం పూజా సామగ్రి గోదావరిలో కలపడానికి పుష్కరఘాట్‌కు వెళ్లాడు. గోదావరిలో కాస్త లోతుకు వెళ్లగా ఫిట్స్ రావడంతో మునిగి చనిపోయి ఉంటాడని త్రీటౌన్ పోలీసులకు అతడి సంబంధీకులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వీరయ్య గౌడ్ తెలిపారు.

ఏజెన్సీ సమాచారం

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన పీవో

మోతుగూడెం, మార్చి 15: ఎన్నికల నిర్వహణకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కావూరి చైతన్య అధికారులను ఆదేశించారు. మోతుగూడెం జిల్లా పరిషత్ పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని, పోలింగ్ కేంద్రంలోని వసతులను ఆదివారం పరిశీలించారు. ప్రతి కేంద్రంలోను విద్యుత్, మంచినీరు, మరుగుదొడ్లు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా దివ్యాంగులకు ఓటు హక్కు వినియోగించేందుకు అనువైన వాతావరణం కల్పించాలని ఎంపీడీవో రవిబాబుకు సూచించారు. అనంతరం పక్కనే ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. మోతుగూడెం పరిధిలో ఉన్న పోర్‌బై ఎంపీయూపీ పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. గ్రామంలో ఫ్లెక్సీలు తొలగించాలని, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని చింతూరు ఎంపీడీవోను ఆదేశించారు.

ప్రజాగళం సభకు తరలివెళ్లిన నాయకులు



ప్రజాగళం సభకు వెళుతున్న టీడీపీ నాయకులు

రంపచోడవరం మార్చి 17: చిలకలూరిపేటలో ఆదివారం టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు సంయుక్తంగా నిర్వహించిన ప్రజాగళం సభకు రంపచోడవరం నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. రంపచోడవరం నుంచి ప్రజాగళం సభకు టీడీపీ జనసేన బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి మిరియాల శిరీషాదేవి ఆధ్వర్యంలో భారీ కాన్వాయ్ బయలుదేరగా ఆ కాన్వాయ్‌ని పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాస్ ప్రారంభించారు.

● ప్రజాగళం సభకు బీజేపీ రంపచోడవరం నియోజకవర్గ కన్వీనర్ ఈకా బుల్లికొండలుదొర, జిల్లా ప్రధాన కార్యదర్శి సోళ్ల బొజ్జిరెడ్డి ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లారు.



ప్రజాగళం సభకు వెళుతున్న బీజేపీ నాయకులు

దుప్పట్లు, దుస్తులు, వాలీబాల్ కిట్లు అందజేత



దుస్తులు, దుప్పట్లు అందజేస్తున్న డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్

మోతుగూడెం, మార్చి17: జిల్లా ఎస్పీ తూహిన్ సిన్హా, రంపచోడవరం ఓఎస్డీ కేవీ మహేశ్వరరెడ్డి, చింతూరు అడిషనల్ ఎస్పీ రాహుల్ మీనా, చింతూరు సీఐ గజేంద్రకుమార్ ఆదేశాల మేరకు బొడ్డగండి పంచాయతీ రెడ్డినగర్ గ్రామంలో గ్రామస్థులతో డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శివకుమార్ మాట్లాడుతూ పోలీసులు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని, ఏ సమస్య వచ్చినా నిర్భయంతరంగా సమస్యలను చెప్పుకోవచ్చన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎటువంటి గొడవలు లేకుండా సహకరించాలన్నారు. మూఢనమ్మకాలు నమ్మొద్దని, బాల్య వివాహాలు చేయవద్దని, మావోయిస్టులకు సహకరించరాదన్నారు. అనంతరం కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గ్రామస్థులకు స్వీట్లు పంచి 20 కుటుంబాలకు దుప్పట్లు, యువతకు దుస్తులు, వాలీబాల్ కిట్లు అందించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కల్యాణ్, కానిస్టేబుల్స్ పోసియ్య, కన్నప్పరెడ్డి, గంగరాజు పాల్గొన్నారు.

వైభవంగా మహాచండీ హోమం



తొర్రేడులో ఒనువులమ్మతల్లి ఆలయంలో మహాచండీ హోమం చేస్తున్న వెంకటశాస్త్రి బృందం

రాజమహేంద్రవరంరూరల్, మార్చి 17: రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడులో గల ఒనువులమ్మ తల్లి ఆలయంలో వార్షికోత్సవాల సందర్భంగా ఆదివారం వైభవంగా మహాచండీ హోమం నిర్వహించారు. బ్రహ్మశ్రీ గోవిందరాజుల వెంకటశాస్త్రి వారి శిష్యబృందంచే ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, చండిమండపం ఆరాధనతో ప్రారంభమైంది. 13 నదుల నుంచి తెచ్చిన నదీజలాలతో, 13 రకాల ద్రవ్యాలతో పంచామృతాలతో ఉత్సవమూర్తులకు అభిషేకం చేశారు. వేద పండితుల మంత్రోచ్చరణలతో పూర్ణాహుతితో చండీహోమం ముగిసింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎన్నికల కోడ్‌తో ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లు తొలగింపు



ఎన్నికల కోడ్‌తో విగ్రహాలకు ముసుగులు వేసిన పంచాయతీ సిబ్బంది

కడియం: మార్చి 17: ఎన్నికల కోడ్ రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కడియం మండలంలో అన్ని గ్రామాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లు, జెండాలు వంటివాటిని తొలగించారు. విగ్రహాలకు ముసుగులు వేశారు. ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ ఆదేశాల మేరకు మండలంలో ఆయా గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు, పార్టీజెండాలు తొలగింపు కార్యక్రమం చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి రైల్వే స్టేషను దగ్గరలోని రైలు పట్టాల వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామని ప్రభుత్వ రైల్వే పోలీసు(జీఆర్పీ) ఎస్‌ఐ మావుళ్లు తెలిపారు. మృతుడి వయసు 35-40ఏళ్లు ఉంటుందని, ఒంటిపై నీలం రంగు ప్యాంటు గులాబి రంగు చొక్కా ఉన్నాయన్నారు. రైలు నుంచి ప్రమాదవ శాత్తూ జారిపడి మృతి చెందినట్లుగా ప్రాథమికంగా భావిస్తు న్నామన్నారు. వివరాలు తెలిసిన వారు ఫోన్ నెం.94910 03239కి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ముగిసిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 17: రాజమహేంద్రవరం మున్సిపల్ కాలనీ క్రీడామైదానంలో జరిగిన 9వ మున్సిపల్ కాలనీ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిసాయి. ఫైనల్ పోటీల్లో రాజా వారియర్స్‌పై డాని కింగ్స్ జట్టు విజయం సాధించింది. విజేతలకు రాజమహేంద్రి విద్యాసంస్థల ఛైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి బహుమతులు అందజేశారు. వాసు, బద్రీనాథ్, పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండు ఆవరణలో చలివేంద్రం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 17: రాజమహేంద్రవరం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా సీఐ అజయ్‌బాబు, అసిస్టెంట్ డీఎంఎస్ఎం త్రిమూర్తులు, ఏఎస్‌ఐ రామకృష్ణ, సుగుణ చిల్డ్రన్స్ హాస్పిటల్ డాక్టర్ దుర్గాప్రసాద్ పాల్గొని దీన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు ఉత్తమ మహిళా అవార్డులు అందజేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ, బొల్లిన గంగరాజు జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు (2002-2005) యర్నగూడెం వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సెక్రటరీ బాలకృష్ణ, ప్రసాద్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న యాదవులు, సమావేశానికి హాజరైన నాయకులు

యాదవుల సంక్షేమానికి టీడీపీ పెద్దపీట

● యాదవ సంఘీయుల ఆత్మీయ సమావేశంలో పార్టీ నేతలు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 17: తెలుగుదేశంపార్టీ అంటేనే యాదవులు పార్టీ అని, వారి సంక్షేమానికి కృషిచేస్తూనే ఉంటామని టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, యర్రా వేణుగోపాలరాయుడు అన్నారు. టీడీపీ యాదవ సంఘీయుల ఆత్మీయ సమావేశం రాజమహేంద్రవరం ఆనంద్ రీజెన్సీ పందిరి హాలులో గ్రేటర్ యాదవ సంఘం అధ్యక్షుడు మరుకుర్తి రవియాదవ్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. దీనికి వారు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. తొలుత శ్రీకృష్ణుడి విగ్రహానికి పూలమాల వేశారు. ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ పదవుల్లోను, కార్పొరేటర్ల సీట్లు కేటాయింపుల్లో ఇచ్చిన ప్రాధాన్యాన్ని వివరించారు. టీడీపీ అధికారంలో ఉన్నా లేకపోయిన చంద్రబాబు.. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడుకు అత్యధిక ప్రాధాన్యమిచ్చారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం బీసీలను విస్మరించిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక యాదవుల కోసం అనువైన స్థలాన్ని ఎంపిక చేసి కమ్యూనిటీ హాలు నిర్మిస్తామన్నారు. యాదవులను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేలా కృషిచేస్తామన్నారు. అనంతరం ఆదిరెడ్డి వాసును యాదవులు సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కొయ్యన కుమారి, రెడ్డి మణి, బుడ్డిగ రాధా, మిస్కా జోగినాయుడు, కరగాని వేణు, మజ్జి రాంబాబు, కడియాల రాజశేఖర్, ఉర్లంకల లోకేష్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి : ఆర్డీవో



రాజకీయ ప్రతినిధులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో చైత్రవర్షిణి

రాజానగరం, మార్చి 17: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కోడ్ అమల్లో ఉన్నందున గ్రామ రెవెన్యూ అధికారులు, రాజకీయ పార్టీల నాయకులంతా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అధికారులు, రాజకీయపార్టీలకు చెందిన నాయకులు విధిగా పాటించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రాజమహేంద్రవరం ఆర్డీవో చైత్ర వర్షిణి ఆదేశించారు. నియోజకవర్గం కేంద్రమైన రాజానగరం తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వీఆర్వోలకు వేర్వేరు సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటుచేసిన రాజకీయ పార్టీల నాయకులు ఫ్లెక్సీలను తొలగించాలని సూచించారు. సొంత స్థలాల్లో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు పెట్టుకుంటే తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలన్నారు. రాజకీయ నాయకులు ఎన్నికల నియమ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు సహకరించాలన్నారు. ప్రచారాలకు వినియోగించే మైక్‌సెట్ల వాహనాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నియోజకర్గంలోని రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల్లో ఎఫ్ఎస్‌టి, వీఎస్‌టి, ఎస్‌సీసీ బృందాలకు సంబంధించిన వాహనాలు పర్యటిస్తున్నాయన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో 24/7 కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. 0883-297195; వాట్సాప్ నెం: 93464 79234కు సంప్రదించవచ్చని చెప్పారు. ఈసమావేశంలో తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ సుల్తానా, ఆర్‌ఐ సీతారామయ్య, వీఆర్వోలు, ఆయా రాజకీయపార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి : సీఐ

అనపర్తి: వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అనపర్తి సీఐ పి.శివగణేష్ అన్నారు. ఆదివారం మండలంలోని అనపర్తి, లక్ష్మీనరసాపురం, అనపర్తి శివారు కొత్తూరు గ్రామాలలో కేంద్ర బలగాలు నిర్వహించిన కవాతు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునే విధంగా వారికి రక్షణ కల్పిస్తామన్న భరోసా కల్పించేందుకు గ్రా మాలలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అప్పారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు,



అనపర్తి: లక్ష్మీనరసాపురంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 17: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే నిజాయితీపరులకు, బీఆర్ అంబేడ్కర్, పూలే ఆశయాలతో ముందుకు సాగే వారిని తమ పార్టీ తరపున పోటీ చేసేందుకు ఆహ్వానిస్తున్నామని భారతీయ చైతన్య పార్టీ వ్యవస్థాపకుడు కట్టా కృష్ణ తెలిపారు. తమ పార్టీ తరపున పోటీచేసే అభ్య ర్థులతోపాటు స్వతంత్ర అభ్యర్థులకు తాము మద్దతు ఇస్తామన్నారు

అభ్యర్థులందరూ ఎన్నికల నియమావళికి బద్ధులై ఉండాలి : కమిషనర్

రాజమహేంద్రవరంసిటీ, మార్చి 17: అభ్యర్థులందరూ ఎన్నికల నియమావళికి బద్ధులై ఉండాలని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. నగరంలో అనుమతులులేని హోర్డింగ్‌లు, బోర్డులు, పెట్టరాదని, ఫ్లెక్సీలను, పోస్టర్లను తొలగించాలన్నారు. ప్రభుత్వ ఆస్తులపై ఎటువంటి బోర్డులు, పోస్టర్లు ఉండరాదన్నారు. గాంధీజీ, అంబేడ్కర్ వంటి జాతీయ నాయకుల విగ్రహాలు తప్ప ఇతర విగ్రహాలన్నింటికీ ముసుగులు వేయాలన్నారు. అభ్యర్థులు ఊరేగింపులు, సమావేశాలు నిర్వహించే సమయంలో ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎటువంటి ఉల్లంఘనలు అనుమతించబోమన్నారు. ఈనెల 17 నుంచి ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, వీడియో సర్వే లెన్స్ టీమ్‌లు, ఇతర బృందాలు నగరంలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు ప్రవర్తనా నియమావళిని పర్యవేక్షిస్తారని కమిషనర్ చెప్పారు. రాజమండ్రి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నగరపాలక సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై ఫోన్ 94940 60060కు ఫిర్యాదు చేయవచ్చని, నగరపాలక సంస్థ ఫేస్‌బుక్, ట్విట్టర్ యాప్ ద్వారా కూడా ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ప్రజల భవిష్యత్ కోసం కూటమిని గెలిపించాలి : ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరంసిటీ, మార్చి 17: ప్రజల భవిష్యత్ కోసం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి ఓటేద్దామని ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 41వ డివిజన్‌లో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వాసు టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణితో కలిసి ఇంటింటికీ కరపత్రాలను పంచారు. రాష్ట్రాన్ని సర్వనాశనంచేసిన జగన్‌ను ఓడించకపోతే రాష్ట్రంఅధోగతి పాలవుతుందన్నారు.

టీడీపీలోకి చేరిన న్యాయవాదులు

రాజమహేంద్రవరం 47వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకుడు న్యాయవాది దారా శేషకుమార్‌తో పాటు పలువురు న్యాయవాదులు ఆదివారం తెలుగుదేశంపార్టీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక తిలక్‌రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు సమక్షంలో వారంతా పార్టీలోకి చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో న్యాయవాదులు శ్రీనివాస్, శ్రీకిరణ్, దొరబాబు, ఖాదర్, సతీష్ తదితరులున్నారు. కార్యక్రమంలో సంసాని ప్రసాద్, చిన్ని, వెంకట్రావు పాల్గొన్నారు.

చిలకలూరిపేట తరలిన తెలుగుతమ్ముళ్లు

చిలకలూరిపేట టీడీపీ-జనసేన-బీజేపీ నిర్వహిస్తున్న సభకు రాజమహేంద్రవరం నుంచి కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో తెలుగుతమ్ముళ్లు తరలివెళ్లారు. స్థానిక తిలక్‌రోడ్డులోని పార్టీ నియోజకవర్గ కార్యాలయం నుంచి ఆదివారం ఉదయం 10 బస్సులు, 150 కార్లులో సుమారు 4వేల మంది వెళ్లారు. ఆయా వాహనాలను వాసు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, ఉప్పులూరి జానకిరామయ్య, మజ్జి రాంబాబు, శెట్టి జగదీష్, మాలే విజయలక్ష్మి, మీసాల నాగమణి, మస్తాన్ చౌదరి, చాపల చిన్నరాజు, చింతపల్లి నాని తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి జిల్లా ఉపాధ్యక్షుడి రాజీనామా



మాజీ కౌన్సిలర్, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నక్కెళ్ళ బాబూరావు ఆ పార్టీకి రాజీనామా చేశారు. గతంలో తెలుగుదేశం పార్టీలో పనిచేసిన ఆయన వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీలో చేరారు. అయితే ఇప్పుడు వ్యక్తిగత కారణాలతో వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు బాబూరావు తెలిపారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు తన రాజీనామా లేఖను పంపించారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు సమక్షంలో ఆయన టీడీపీలోకి చేరనున్నారు.

మహిళలకు వచ్చే వ్యాధులపై పీఎంపీలకు అవగాహన అవసరం

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 17: మహిళలకు వచ్చే వ్యాధులపై ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (పీఎంపీ)కు అవగాహన అవసరమని గైనకాలజిస్టు డాక్టర్ మాధురీదేవి సముద్రాల అన్నారు. కమ్యూనిటీ పారా మెడికల్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు రాజమండ్రిశాఖ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్‌ఖాన్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధురీదేవి మాట్లాడుతూ స్త్రీలు ఇబ్బంది పడే వ్యాధులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి చికిత్స అందించడంతోపాటుగా వ్యాధి గురించి జాగ్రత్తలను స్త్రీలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు, పి.దేవానందం, మట్టా రమేష్, యు.ప్రసాద్‌బాబు, కేవీఎస్ఎస్ రెడ్డి, సుంకర శ్రీనివాస్, ఎమ్.బాపూజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధురీదేవిని సభ్యులు సత్కరించారు.



వృద్ధురాలిని ఓటు వేయమని అడుగుతున్న మహాలక్ష్మి

కోటపాడులో మహాలక్ష్మి ప్రచారం

రంగంపేట, మార్చి, 17: మండలంలోని కొత్తకోటపాడులో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సతీమణి నల్లమిల్లి మహాలక్ష్మి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యం లో మహానాడులో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు మహాశక్తి కార్యక్రమం ద్వారా పొందే లబ్ధిని వివరిస్తూ మహిళలకు, రైతులకు, గ్రామస్థులకు కరపత్రాలను పంపిణీచేస్తూ రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీకి ఓటువేసి గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పూనల శ్రీనివాస్, కొమ్మన రాంబా బు, ఆచంట వెంకటేష్, మండల, గ్రామ టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి : ఎంఈవో

● ఎంఈవో సత్తిరెడ్డి

అనపర్తి, మార్చి 17: మండలంలో సోమవారం నుంచి జరుగనున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి తెలిపారు. ఆదివారం అనపర్తిలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని నాలుగు పాఠశాలల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని అనపర్తిలోని బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నతపాఠశాల, జీబీఆర్ ఇంగ్లీషు మీడియం పాఠశాల, కుతుకులూరులోని ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహించనున్నామన్నారు. మండలం లోని నాలుగు సెంటర్లలో 871మంది రెగ్యులర్ విద్యార్థులు, 88మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని ఆయన తెలిపారు.

బిక్కవోలు: మండలంలో సోమవారం నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. మండలంలో 609 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. వీరి కోసం ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. బిక్కవోలు, బలభద్రపురం, ఇళ్లపల్లి ఉన్నత పాఠశాలలతో పాటు, పందలపాక ఉన్నత పాఠశాలలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణకు 35మంది ఇన్విజిలేటర్లు, ఐదుగురు సీఎస్‌లు, ఐదుగురు డీవోలను నియమించినట్లు ఎంఈవో వివరించారు.

సెల్‌ఫోన్‌లు తీసుకురాకూడదు

కోరుకొండ: ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి పరీక్షలకు విద్యార్థులు ఎవరూ పరీక్షా కేంద్రాలకు సెల్‌ఫోన్‌లు తీసుకురాకూడదని పేర్కొన్నారు. డ్యూటీ ఉపాధ్యాయులు అటెండెన్స్ యాప్‌నందు తప్పనిసరిగా స్పెషల్ డ్యూటీ ఎస్ఎస్‌సీ డ్యూటీ అప్లై చేయాలన్నారు. ఎస్ఎస్‌సీ డ్యూటీ అప్లై చేసే సందర్భంలో డ్యూటీకి వెళ్లే పాఠశాల లోకేషన్ కోడ్ ఎంటర్ చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలకు సెల్‌ఫోన్‌లు తీసుకురాకూడదనే నిబంధన ఉంది. డ్యూటీలో ఉన్న ఉపాధ్యాయులందరూ స్పెషల్ డ్యూటీ అప్లై చేయాలని ఎంఈవో తెలిపారు.



చిలకలూరిపేట సభకు వెళుతున్న టీడీపీ నాయకులు

ప్రజాగళం సభకు తరలిన నాయకులు

కడియం/రాజమహేంద్రవరంరూరల్, మార్చి 17: గుంటూరు జిల్లా చిలకలూరిపేట బొప్పూడివద్ద జరిగిన ప్రజాగళం భారీ బహిరంగసభకు రాజమహేంద్రవరంరూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పిలుపు మేరకు తెలుగుదేశం నాయకులు తరలివెళ్లారు. వారితో పాటు జనసేన, బీజేపీ నాయకులు కూడా ప్రజాగళం సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ప్రజాగళం సభ ఓ చరిత్ర సృష్టించబోతుందన్నారు.

ప్రశాంతంగా గ్రూప్1 పరీక్ష

దివాన్‌చెరువు, మార్చి 17: ఏపీపీఎస్సీ గ్రూప్1 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రానికి 550మంది అభ్యర్థులను కేటాయించగా ఆదివారం ఉదయం జరిగిన పరీక్షకు 235 మంది అభ్యర్థులు, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 228మంది హాజరైనట్లు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ పి.విజయనిర్మల తెలిపారు. ఈ పరీక్షా కేంద్రానికి జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.సునీల్ వినయ్ లైజాన్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ పరీక్షాకేంద్రాన్ని సందర్శించారు. పాలచర్లలోని బీవీసీ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రానికి కేటాయించిన 549 మందికి ఉదయం 349మంది అభ్యర్థులు మధ్యాహ్నం పరీక్షకు 345 మంది హాజరైనట్లు పరీక్షాకేంద్రం సి.ఎస్.రవికాంత్ తెలిపారు. ఈకేంద్రానికి డీజీపీవో రాంబాబు లైజాన్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. భూపాలపట్నంలోని రైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షాకేంద్రంలో 480మంది అభ్యర్థులను కేటాయించారని సి.ఎస్.ఆర్.రాంబాబు తెలిపారు. గృహనిర్మాణశాఖ పీడీ శ్రీనివాస్ లైజాన్ అధికారిగా వ్యవహరించారు.

ఐఎస్‌టీఎస్ కళాశాలలో..



కళాశాలలో పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న జేసీ తేజ్‌భరత్

రాజానగరం: మండలంలోని తూర్పుగోనగూడెంలో గల ఐ.ఎస్.టి.ఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఏపీపీఎస్సీ పరీక్షా కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ ఆదివారం సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. గ్రూప్ 1 పరీక్షా కేంద్రంలో ఆదివారం జరిగిన పరీక్షకు 672 మంది అభ్యర్థులను కేటాయించగా ఉదయం పరీక్షకు 474మంది అభ్యర్థులు, మధ్యాహ్నం 471 మంది అభ్యర్థులు హాజరైనట్లు సీఎస్ రాజశ్రీ తెలిపారు. లైజనింగ్ అధికారిగా జిల్లా అధికారి వరప్రసాద్ బాధ్యతలు నిర్వర్తించారు. అడిషనల్ ఎస్పీ సర్దార్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, రాజానగరం సీఐ పి.కాశీవిశ్వనాధం పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు.

నేటి నుంచి పాఠశాలలకు ఒంటిపూట బడులు

కోరుకొండ, మార్చి 17: కోరుకొండ మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సోమవారం నుంచి ఒంటిపూడ బడులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో టి.కుశలవ దొర తెలిపారు. దీని ప్రకారం పాఠశాలలు ఉదయం 7.45గంటల నుంచి మ ధ్యాహ్నం 12.30గంటల వరకు జరుగుతాయన్నారు. పిల్లలకు మధ్యాహ్న భోజనం 12.30కు పిల్లలకు అందిస్తారని తెలిపారు.

అలరించిన కర్ణాటక సంగీత గాత్ర కచేరి



గీతాలు ఆలపిస్తున్న వందన

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి 17: స్థానిక దానవాయిపేటలోని సంగీత లహరి కళావేదిక ప్రాంగణంలో ఆదివారం జరిగిన కర్ణాటక సంగీత గాత్ర కచేరి శ్రోతలను అలరించింది. తిరుపతి నుంచి వచ్చిన కె.వందన(గాత్రం), కె.చైతన్య రమేష్(మృదంగం), కేవీ కృష్ణ(వయొలిన్), బి.మారుతి రఘురామ్(ఘటం) బృందం శ్రోతలను పరవశింప జేశారు. కార్యక్రమంలో సంగీత ప్రియులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన పరదేశమ్మ జాతర




కోరుకొండ, మార్చి17: మండలంలోని నర్సాపురంలో పరదేశమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం రాత్రితో వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జనసేన నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి, తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. అమ్మవారి జాతర ముగింపు సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎంపీపీ వుల్లి బుజ్జిబాబు, జడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కడియాల పాపారావు, కోరుకొండ సొసైటీ అధ్యక్షుడు మారిశెట్టి నాయుడు, ఎంపీటీసీ పీతా శ్రీను, కోరుకొండ, కణుపూరు, గాదరాడ, జంబుపట్నం, పశ్చిమగోనగూడెం, ఎదురుపాక గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న భక్తులు

బిక్కవోలు, మార్చి 17: కొంకుదురు చింతకాలువ గట్టున పొలాల మధ్య వెలసిన యద్దాలమ్మగుడి వద్ద ఆదివారం ఘనంగా చండీహోమం నిర్వహించారు. ఈ హోమంలో గ్రామానికి చెందిన కర్రి వెంకటరెడ్డి, వెలగల అశోక్‌రెడ్డి, సత్తి గణేష్‌రెడ్డి, కర్రి శివశేషారెడ్డి దంపతులు పాల్గొన్నారు. అనంతరం రైతుల సహకారంతో భారీఎత్తున అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సోమ) సా.6.22
సహరి(మంగళ) ఉ.4.48

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	37.0	24.0

గ్రూప్-1కు 8258 మంది

రాజమహేంద్రవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం జిల్లావ్యాప్తంగా 25 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 8,258 మంది దరఖాస్తు చేసుకోగా ఉదయం జరిగిన పేపర్-1కి 5,056 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం పేపర్-2కి 5,007 మంది హాజరయ్యారు. ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల, ఆదికవి నన్నయ యూనివర్సిటీ లోని పరీక్షా కేంద్రాలను జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ తనిఖీ చేశారు. సదుపాయాలపై ఆరా తీశారు. డీఆర్వో జి.నరసింహులు, రాజమహేంద్రవరం ఆర్డీవో ఎ.చైత్ర వర్షిణి పలు కేంద్రాలను పరిశీలించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేశారు. అక్కడక్కడా విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి ఇబ్బందిపడినా సమయానికి మాత్రం పరీక్షకు హాజరయ్యారు. ఎక్కడెక్కడి నుంచో అభ్యర్థులు తరలిరావడంతో ఆటోలకు డిమాండ్ ఏర్పడింది.



గ్రూప్-1 పరీక్షను తనిఖీ చేస్తున్న జేసీ తేజ్‌భరత్

నేటి నుంచి 'పది' పరీక్షలు

రాజమహేంద్రవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభ మవుతున్నాయి. ఈ మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. జిల్లావ్యాప్తంగా పరీక్షలకు 29,990 మంది విద్యార్థులు హాజరవుతారు. ఈ మేరకు 137 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. ఉదయం 8.45 గంటల నుంచి 9.30 గంటల వరకూ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఉదయం 10 గంటల తర్వాత అనుమతి ఉండదు. పిల్లలు ఎక్కడా ఇబ్బంది పడకుండా కలెక్టర్ ఆదేశాలతో ఏర్పాట్లు చేశామని, ఒత్తిడికి గురవ్వకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా పాఠశాల విద్య అధికారి వాసుదేవరావు సూచించారు. పరీక్షా సమయానికి అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. 10వ తరగతి విద్యార్థులు పరీక్ష తేదీల్లో నివాస గ్రామం నుంచి పరీక్షా కేంద్రానికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. విద్యార్థులు బస్సు కండక్టర్లకు తమ హాల్ టిక్కెట్లు చూపించాలి. ఈనెల 18 నుంచి 30వ తేదీ వరకూ మాత్రమే ఇది వర్తిస్తుంది. 8లో..



పరీక్షకు సంబంధించి బెంచీలపై హాల్‌టిక్కెట్ నెంబర్లను పరిశీలిస్తున్న సిబ్బంది

నేటి నుంచి ఒంటిపూట బడులు

రాజమహేంద్రవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సోమవారం(నేడు) నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. పది పరీక్షలు కూడా ఇదే రోజు నుంచి మొదలు కావడంతో పరీక్షా కేంద్రాలు ఉన్న స్కూల్స్ ఒంటిపూట బడుల సమయాలను పరీక్షలు ముగిసే వరకూ మార్పు చేశారు. పరీక్షా కేంద్రం లేని స్కూల్స్‌లో ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ, పరీక్షా కేంద్రం ఉన్న చోట మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకూ తరగతులు నిర్వహిస్తారని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి వాసుదేవ రావు తెలిపారు. పది పరీక్షలు ముగిసిన మరుసటి రోజు నుంచి ఆయా స్కూల్స్‌లో కూడా ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ తరగతులు నడుస్తాయన్నారు. ఏప్రిల్ 23 వరకూ ఒంటి పూటబడులు ఉంటాయని పేర్కొన్నారు.

కోట సత్తెమ్మకు విశేష పూజలు



నిడదవోలు, మార్చి 17 : తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో ఆదివారం విశేష పూజలు చేశారు.ఐ అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహానివేదన చేశారు. అమ్మవారికి ఇష్టమైన రోజు కావ డంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.ఆదివారం అమ్మ వారికి రూ.1,39,573లు ఆదాయం లభించినట్టు కార్య నిర్వహణాధికారి వి.హరి సూర్య ప్రకాష్ తెలిపారు.

బాబోయ్.. 56 రోజులా..



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

అంతా జగన్నాయ.. అనుకున్నది అనుకున్నట్టు జరిగితే అందులో వింతేముంది..చివరికి ఎన్నికల షెడ్యూల్ విషయంలో కూడా అదే జరిగింది. ఎన్నికలు 40 రోజుల్లో జరిగిపోతాయని అంతా భావించారు.అయితే రాజకీయ నాయకుల లెక్క మారింది.. ఎన్నికల షెడ్యూల్ వచ్చింది సరే. పోలింగ్ తేదీకి సుమారు రెండు నెలలు గడువు ఉండడంతో బాబోయ్ ఇన్ని రోజులా అని రాజకీయ పార్టీలు అభ్యర్థుల్లో గుబులు మొదలైంది.ప్రస్తుతం ఎన్నికలంటే ఖర్చుతో కూడుకున్నపని. విస్తృత ప్రచారం చేయాలి.. రెండు నెలల పాటు ఓటర్ల చుట్టూ తిరగాలి.. దానికి మందీ మార్బలం ఉండాలి.. డబ్బులేనిదే ఎవరైనా తిరుగుతారా.. అంతా డబ్బుతోనే పని. ప్రచా రానికి అవసరమైన సరంజామా ఏర్పాటు చేసుకోవాలి. కార్యకర్తలు, ప్రచారం చేసేవారు కావాలి. ప్రతీ ఊళ్లలోనూ ప్రచారం చేసేవారు కావాలి. ఎన్నికల కార్యాలయాలు ఏర్పాటు చేయాలి. వాటిని నిర్వహించేవారు కావాలి. ప్రచార రథాలు, ఇతర వాహనాలు అవసరం. ఓటర్ల కోసం ఇంటింటా సర్వే కూడా చేస్తుంటారు. ఈ సర్వే కోసం పెద్ద టీమ్ అవసరం. జిల్లాలో ఒక నియోజకవర్గంలో కేవలం ఇంటింట ఓటర్ల సర్వే చేసి పార్టీ మ్యానిఫెస్టో కరపత్రాలు, బ్యాడ్జీలు, స్టిక్కర్లు ఇవ్వడానికి 1200 మంది యువకులను ఏర్పాటు ఏర్పాటు చేశారు. నిత్యం వారి మంచిచెడ్డలు చూడాలి. ఇటీవల గ్రామాల్లో పెడుతున్న మీటింగ్‌లకు డబ్బులు ఇవ్వాల్సి వస్తోంది. రెండు మూడు గంటలు ఉండడానికి కనీసం రూ.150 నుంచి రూ.200 వరకూ ఇస్తున్నారు. గతంలో అయితే నాయకులు ఎక్కడైనా సభ పెడితే స్వచ్ఛందంగా వచ్చేవారు 70 శాతం మంది ఉండేవారు. మరో 30 శాతం మందిని తెచ్చుకునేవారు. అయితే ప్రస్తుతం వంద శాతం డబ్బుతోనే పని.. కేవలం 10 శాతం మంది మాత్రమే స్వచ్ఛందంగా తరలివస్తున్నట్టు సమాచారం.ఓటరు దగ్గరకు వెళ్లినప్పుడు అభ్యర్థి ఒక్కరే వెళితే బాగోదు.. అట్టహాసానికి 20 మంది అయినా వెంట ఉండాలి.. వారి ఖర్చులు బాగోగులు అంతా అభ్యర్థి జేబు నుంచే రావాలి.. వెంట తిరిగేవారి పెట్రోల్ ఖర్చులు..భోజనాలు.. ఇలా అనేక సమస్యలు ఉంటాయి. అన్నీ పోను అన్ని వర్గాలను ఆకట్టుకోవాలి. వారిలో పలుకుబడి ఉన్నవారిని, పార్టీ కోసం పనిచేసే వారి ఆలనాపాలనా కూడా చూస్తుండాలి. ఇలా రోజుకే రూ.లక్షల్లో ఖర్చు ఉంటుంది. ఈ నెల 16వ తేదీన ఎన్నికల షెడ్యూల్ వచ్చింది.వచ్చే నెల 18వ తేదీన నోటిఫికేషన్ జారీ అవుతుంది. అప్పటి నుంచే అసలు ఘట్టం మొదలవుతుంది. నామినేషన్లు మొదలు. మే 13న పోలింగ్ జరుగుతుంది. వీటి మధ్య సుమారు 56 రోజుల సమయం ఉంది. బాగా ప్రచారం చేసుకోవాలి, ప్రతీ ఓటరును కలవాలని, ప్రతి సమస్య తెలుసుకోవాలి, తమ పార్టీ మేనిఫెస్టోని ప్రతీ అంశం ఓటరు వద్దకు చేరాలని భావించే వారికి ఈ సమయం చాలా సంతోషకరంగా ఉంటుంది. ఖర్చు మాత్రం మరింత భారం అవుతుంది.

- మే 13న ఎన్నికల పోలింగ్
- సుమారు రెండు నెలల గ్యాప్
- అయోమయంలో అభ్యర్థులు
- ఖర్చు పెరిగిపోతోందని టెన్షన్
- ఎన్నికల ప్రచారానికి రెడీ
- మరో పక్క ఎండ దెబ్బ
- ఎన్నికల వరకు 'స్పందన'కు బ్రేక్

అభ్యర్థులకు తప్పదు ఎండదెబ్బ

ఇప్పటికే ఎండలు మండిపోతున్నాయి.ఈ ఏడాది ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరిక చేసింది. ఈ నేపథ్యంలో ఇంకా పెరిగే అవకాశం ఉంది.అంటే ఎన్నికల సమయానికి ఎండ ముదిరిపోతోంది.దీంతో ఏప్రిల్,మేనెలలో వడదెబ్బ ఉంటుంది.ఆ సమయంలో ఇబ్బందులు ఉంటాయి.ఎండ వల్ల జనం తిరగడానికి మరిన్ని సౌక ర్యాలు కల్పించాల్సి ఉంటుంది.చెమటలు కక్కుకుంటూ ప్రచారం చేయడం ఎన్నికల సమయంలో మామూలే. కాళ్లు బొబ్బ లు వచ్చినా నడక మానరు.దీంతో ఎండ వల్ల ఇబ్బందులు తప్పవు.

వలంటీర్లకు బ్రేక్.. వైసీపీకి షాక్

వలంటీర్లతో పబ్బంగడుపుకోవాలని చూసిన వైసీపీ గుండెల్లో బాకు దిగింది. ఎన్నికల కమిషనన్ వలంటీర్లను ఎన్నికల డ్యూటీలకు దూరంగా ఉంచాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. దీంతో వైసీపీ కంగారు పడుతోంది. ఇప్పటికే అనవసరంగా వలంటీర్లకు సన్మానాలు చేశాం. అవార్డులు ఇచ్చాం. చివరికి ఇటీవల గిఫ్టలు కూడా ఇచ్చామే అని వైసీపీ నేతలు వాపోతున్నారు.జిల్లాలో 9300 మంది వలంటీర్ల పోస్టులు ఉండగా, ప్రస్తుతం 8వేల మంది విధుల్లో ఉన్నారు.ఇటీవల జీతం పెంచాలని కోరినందుకు కొందరు వలంటీర్లను తొలగించిన సంగతి తెలిసిందే. ఈ బాధ వలంటీర్లందరిలోనూ ఉంది.

ఎన్నికల వేళ 'స్పందన' రద్దు

సార్వత్రిక ఎన్నికల షెడ్యూ ల్ విడుదల చేసిన కారణంగా ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ లోనూ, జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లోనూ జరిగే స్పందన కార్యక్రమం రద్దయినట్టు జిలా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లాకలెక్టర్ డా. కె.మాధవీలత తెలి పారు. ఇప్పటి వరకూ స్పందన కార్యక్రమం కింద జిల్లా ,డివిజన్, మండల , గ్రామ సచివాలయ స్థాయిల్లో ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరిస్తున్న సంగతి తెలిసిందే. ఇక రద్దయిందని.. ఎన్నికలు ముగిసే వరకూ స్పందని ఉండ దని ప్రజలు గమనించాలన్నారు.

నియమావళి కచ్చితంగా పాటించాలి
జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత

రాజమహేంద్రవరం, మార్చి17(ఆంధ్రజ్యోతి) : కోడ్ అమల్లో ఉన్నందున నియమావళిని కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డా. కె.మాధవీలత ఆదేశించారు. జిల్లాలో ఇంకా కొన్ని ప్రాంతాల్లో హోర్డింగ్‌లు, పోస్టర్లు, కటవుట్‌లు తొలగించ లేని విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. 24 గంటల్లో అమలు చేయవలసిన పనులు, 48 గంటల్లో చేయవలసిన పనులు, 72 గంటల్లో చేయవలసిన పనుల ప్రకారం తక్షణం తొలగింపు చర్యలు తీసుకుని నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వెలగపూడి నుంచి ఆదివారం ఏపీ ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం జిల్లాలోని నియోజకవర్గ రిటర్నింగ్ అధికార్లతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు(ఎఫ్ఎస్) ఎన్నికల నిర్బంధ నిర్వహణ వ్యవస్థ (ఈఎస్ఎంఎస్) పూర్తి స్థాయిలో విధుల్లో భాగస్వాములు కావాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో తనిఖీలకు క్షేత్రస్థాయిలో బాధ్యతలు నిర్వహించే సిబ్బందికి మెజిస్ట్రియల్ అధికారాలకు ప్రతిపాదనలు పంపాలన్నారు. సీ-విజిల్ ద్వారా వచ్చిన ఫిర్యాదుకు 100 నిమిషాల్లో ప్రతి స్పందన ఉండాలన్నారు. వీటిపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యక్ష పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి వివరాలూ, ఎక్కడ నుంచి ఫిర్యాదు వచ్చిందనే సమాచారం పూర్తిగా ఉంటాయని, అక్కడికి సంబంధిత ఫంక్షనరీ యూనిట్(ఎఫ్‌యు) చేరుకుని అక్కడి వివరాలు యాప్ ద్వారా నివేదిక సమర్పించాలన్నారు. నియోజకవర్గాల వారీ కౌం టింగ్ రూమ్‌లు, తదితర అంశాల్లో ఏమైనా పెండింగ్ ఉంటే వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ కె.దినేష్‌కుమార్, డీఆర్వో జి.నర సింహులు,రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ ఈఆర్వో ఆర్.కృష్ణానాయక్, డీటీ సునీల్ పాల్గొన్నారు.

బైక్ మీద.. పెట్రోల్ మాది..



ఎన్నికల షెడ్యూల్ అలా విడుదలైందో లేదో నాయకులు ఇలా రోడ్డెక్కేస్తున్నారు.. ఎక్కడా ఖర్చుకు వెనకడుగు వేయడం లేదు.. ఏకంగా 56 రోజులు ఇదే తీరుగా ఉంటుంది. నిడదవోలు మండలం కోరుమామిడి నుంచి విజ్జేశ్వరం వరకు ఆదివారం ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో వైసీపీ బైక్ ర్యాలి నిర్వహించింది. ఈ బైక్ ర్యాలీకి బైక్‌లు తెచ్చుకున్న వాళ్లందరికి ఒక్కొక్కరికి రెండు వందల రూపాయిల పెట్రోల్ పోయించి ర్యాలీ నిర్వహించినట్టు సమాచారం. బైక్ ర్యాలీ అనుమతులపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమణ నాయక్‌ను వివరణ కోరగా ఈ బైక్ ర్యాలీకి 100 బైక్‌లు, 100 జెండాలు, ఒక ప్రచార రథానికి అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఈ బైక్ ర్యాలి మొత్తాన్ని వీడియో సర్వలెన్స్ టీమ్ రికార్డు చేసిందని ఈ ఖర్చు అంతా శ్రీనివాస్ నాయుడు ఎన్నికల ఖర్చులో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. - **నిడదవోలు**

అంబులెన్స్‌లు మూలకు



దుమ్ము పట్టి ఉన్న కాన్వాయ్ అంబులెన్స్

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 17 : అత్యవసర వైద్య సమయంలో రోగులు, ఇతర బాధితులను ఆసుపత్రులకు తరలించడానికి సంజీవనిలా ఉపయోగపడే ప్రాణరక్షలు (అంబులెన్సులు)ను రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో పక్కనబెట్టేశారు. దాదాపు నిరుపయోగంగా మార్చేశారు. దీంతో కాకినాడ జీజీహెచ్‌కు రిఫరల్‌తో సహా ఇతర వైద్యపరమైన అన్ని సేవలకూ 108 వాహనాలనే ఉపయోగిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు చెందిన కొన్ని అంబులెన్సులు తుప్పుపట్టి స్క్రాప్‌గా మారిపోతున్నాయి.

నీరుగారుతున్న దాతల ఆశయం

రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో మూడు అంబులెన్సులు ఉండగా .. వీటిలో గతంలో ఎంపీ (రాజ్యసభ సభ్యుడు) సురేష్‌ప్రభు తన ఎంపీ ల్యాడ్స్‌తో సమకూర్చిన ఒక అంబులెన్సుతో పాటు రాజమండ్రి మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్ తన నియోజకవర్గ అభివృద్ధి నిధులతో అందజేసిన మరో అంబులెన్సు, ట్రామాకేర్‌కు చెందిన ఒక అంబులెన్సు ఉన్నాయి. మొత్తం మూడు అంబులెన్సులు జీజీహెచ్‌కు చెందినవే అయినా ఇవన్నీ దాదాపు నిరుపయోగంగానే ఉన్నాయి. వీటిలో సురేష్‌ప్రభు సమకూర్చిన అంబులెన్సు ఒక్కటే అప్పుడప్పుడూ వినియోగిస్తున్నారు. దీన్ని సీఎం, ప్రతిపక్ష నేత, ఇతర రాజకీయ ప్రముఖుల (వీఐపీలు) పర్యటనల సమయంలో కాన్వాయ్‌కు, కాకినాడ సెంట్రల్ డ్రగ్‌స్టోర్ నుంచి జీజీహెచ్‌కు మందులు తీసుకురావడానికి ఉపయోగిస్తున్నారు. ట్రామాకేర్ అంబులెన్స్‌ను అప్పుడప్పుడూ వాడుతున్నా పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేలేదు. ఇక ఎంపీ మాగంటి మురళీమోహన్ సమకూర్చిన అంబులెన్స్‌ను పూర్తిగా మూలనపడేశారు. మెయింటెనెన్స్ చేయకుండా ఇలా కొన్నాళ్లు వదిలేస్తే స్క్రాప్‌గా మారిపోయే ప్రమాదం ఉన్నా జీజీహెచ్ అధికారులు వీటి గురించి పట్టించుకున్న పాపాన పోవడంలేదు. అంబులెన్సులను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురాలేకపోవడంతో అంబులెన్సుల డ్రైవర్లుకు పెద్దగా పని ఉండడంలేదు. జీజీహెచ్ అధికారులు వీరిని ఇతర అవసరాలకు వాడుకుంటున్నారు.



- తుప్పుపట్టిపోతున్న అంబులెన్స్‌లు
- మూలకు మూడు ప్రాణరక్షలు
- పనిచేస్తున్నా వినియోగించని వైనం
- మురళీమోహన్ అంబులెన్స్ పరిస్థితి ఇంతే
- జిల్లా ఆసుపత్రిలో పట్టించుకోని అధికారులు
- అత్యవసరంలో అందక రోగుల ఇక్కట్లు
- నెరవేరని దాతల ఆశయం

అమలాపురంది ఇక్కడెందుకు..

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఏరియా ఆసుపత్రికి చెందిన అంబులెన్సు గత కొన్నేళ్లుగా జీజీహెచ్ ఆవరణలో వదిలేశారు. పోలీస్ అవుట్‌పోస్టు సమీపంలో ఎండకు ఎండి, వానకు తడుస్తున్న చందంగా ఉంది దీని పరిస్థితి. టైర్లు, ఇతర పరికరాలు దాదాపుగా శిథిలావస్థకు చేరుతున్నాయి. కొన్నాళ్లు పోతే ఈ అంబులెన్సు రూపురేఖలు పూర్తిగా మారిపోయి స్క్రాప్‌కు చేరే ప్రమాదం ఉంది. దీన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రికి ఇచ్చేయకుండా ఇక్కడే ఎందుకు ఉంచుతున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం అన్ని సేవలకూ ప్రైవేట్ సంస్థ నిర్వహణలోని 108 అంబులెన్సులనే ఉపయోగిస్తున్నందున జీజీహెచ్ ఆస్తులుగా ఉన్న సొంత అంబులెన్స్‌లను పరిరక్షించుకోలేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



రాజమహేంద్రవరం టీటీడీ కల్యాణ మండపం వద్ద ఇలా..

ఇవి కనిపించలేదా సార్!

రాజమహేంద్రవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి)/అనపర్తి: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు ఆరంభమైపో యాయి. శనివారం సాయంత్రం 3గంటల సమయంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. వెంటనే 24 గంటల్లో, 48 గంటల్లో, 72గంటల్లో జరగాల్సిన పనులను నిర్దేశిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులిచ్చింది. వాటి ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ పార్టీలు/రాజకీయ నాయకుల హోర్డింగ్‌లు, పోస్టర్లు, కటౌట్లు 24గంటల్లో తొలగించాల్సి ఉంటుంది. ఇదే విషయాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా కూడా ఆదివారం జిల్లా కలెక్టర్లతో వర్చువల్ విధానంలో జరిగిన సమావేశంలో స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం 3 గంటల్లోగా ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగింపులు జరగాలని ఆదేశించారు. కానీ బాధ్యతాయుతంగా ఉండాల్సిన అధికార పార్టీ మాత్రం ఉల్లంఘనలను మొదలు పెట్టేసింది. జిల్లా కేంద్రంలోనూ జగన్ తదితర వైసీపీ నాయకులతో ఉన్న ఫ్లెక్సీలు ఆదివారం రాత్రి కూడా దర్శనమిచ్చాయి. శ్యామలాసెంటర్ సమీపంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు బ్రాంచి నిర్మాణం జరుగుతోంది. ఇక్కడ జగన్ చిత్రంతో బోర్డు ఏర్పాటు చేశారు. ఆ పక్కనే మరో ఫ్లెక్సీలో సిట్టింగ్ ఎంపీ భరత్‌రామ్ బొమ్మ కూడా ఉంది. ఇవి ఒకటి బ్రాంచి మేనేజర్, నోడల్ ఆఫీసర్ పేరున, మరొకటి బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి పేరున ఉన్నాయి. అలాగే ఉమెన్స్ కళాశాల దగ్గరలోని జంక్షనులో ఓ ప్రభుత్వ భవనానికి అమర్చిన జగన్ చిత్రాలు ఉన్న పెద్ద హోర్డింగులను తొలగించలేదు. ఈ రెండు ప్రాంతాలూ ఎప్పుడూ రద్దీగా ఉంటాయి. దీంతో ఇక్కడ ఈ పోస్టర్లు అటు అధికారులకు, ఇటు వైసీపీ నాయకులకు కానరాకపోవడంపై జనాలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తొలగించే వరకూ అధికార పార్టీ నాయకులకు బాధ్యత లేదా? అని ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గ కేంద్రమైన అనపర్తిలో అనేక చోట్ల రాజకీయ పార్టీల నేతల పటాలు దర్శనమిస్తున్నాయి. అనపర్తి మెయిన్‌రోడ్డులో వీధికి ఏర్పాటు చేసిన ఆర్చిలో కింద ఉన్న నేతల ఫొటోలను కప్పి పైవరుసలో ఉన్న ఫొటోలను వదిలివేశారు.



రాజమహేంద్రవరం డీసీసీబీ బ్యాంక్ వద్ద ఫ్లెక్సీలు



అనపర్తి మెయిన్‌రోడ్డులో ఆర్చిపై ఉన్న ఫొటోలు

ఉమా చోడేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన


చోడేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న పండితులు

కొవ్వూరు, మార్చి 17: ఉమా చోడేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. కొవ్వూరులోని పాత వూరులో చోడేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అర్చకులు కౌతవరపు భాను ఆధ్వర్యంలో రాజమహేంద్రవరానికి చెందిన చిరవూరి సుబ్రహ్మణ్యం, రమా సత్యశైలజ దంపతులు పంచామృత అభిషేకాలు, విశేష పూజలు జరిపించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, ఏకాదశ రుద్రాభిషేకాలు, రుద్రహోమం, అమ్మవారికి కుంకుమ పూజ, శివునికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. దేవతామూర్తులకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు దేవరకొండ ఉమా, పమ్మి రవిబాబు, చిరవూరి సోమయాజులు దామరాజు సచ్చిదానంద, కందుకూరి లక్ష్మీ నరసింహ శాస్త్రి, తెన్నేటి సూర్యనారాయణ, కలిగొట్ల కృష్ణారావు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనపై హర్షం

పెరవలి, మార్చి 17: ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 30 నుంచి 40 ఎమ్మెల్యే సీట్లు, ఐదు ఎంపీ సీట్లు గెలుచుకునే అవకాశం ఉందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి హర్షం వ్యక్తంచేశారు. షర్మిల ఆధ్వర్యంలో జరిగే ఈ ఎన్నికలకు తాను కూడా అండగా ఉంటానని ప్రకటించడంపై ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఏపీలో ఎన్నికలు జరగడానికి సుమారు 45 రోజులు సమయం ఉండడం వల్ల ఇది కాంగ్రెస్ పార్టీకి అనుకూలిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారన్నారు.

కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్

కొవ్వూరు, మార్చి 17: కేంద్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహించడానికి షెడ్యూల్ విడుదల చేసినట్టు కొవ్వూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల నిమిత్తం ఎటువంటి ఫిర్యాదులున్నా రిటర్నింగ్ అధికారి, కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నెలకొల్పిన కమాండ్ కంట్రోల్ సెంటర్ నెంబరుకు 9440295493కి తెలియజేయాలన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'మానవత' ఆర్థిక సాయం

నల్లజర్ల, మార్చి 17: మండలంలోని ఆవపాడు గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కోడే సత్యనారాయణ, ఈర్లపాటి వెంకట్రావులను మానవత సంస్థ సభ్యులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఇద్దరికీ ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో బోగవల్లి వెంకట సుబ్బారావు, గుళ్ళపూడి వెంకటరత్నం, ఆచ్యుల మధుసూదనరావు, మద్దూరి విష్ణుమూర్తి పాల్గొన్నారు.

20న వినాయక ఆలయ పున:ప్రతిష్ఠ

నల్లజర్ల, మార్చి 17: మండలంలోని చీపురుగూడెంలో వర సిద్ధి వినాయక ఆలయ పున:ప్రతిష్ఠ కార్యక్రమం ఈ నెల 20న నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. 18వ తేదీ నుంచి విఘ్నేశ్వర పూజ, రక్షబంధనం, పంచగవ్య ప్రాసన, అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం, హోమాలు జరుగుతాయని 20న అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

దేవరపల్లి, మార్చి 17: మండలంలోని చిన్నాయిగూడెం గ్రామానికి చెందిన సోమిశెట్టి దుర్గమ్మ ఐదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ నేపత్యంలో యర్నగూడెం బొల్లిన గంగరాజు జడ్పీ హైస్కూల్ 2002-2005 బ్యాచ్ విద్యార్థులు, హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ సంస్థ ద్వారా దుర్గమ్మకు నిత్యావసర సరుకులు, నగదును అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి బాలకృష్ణ, సభ్యులు ప్రసాద్, వెంకన్న, ఆంజనేయులు, పెద్దిరాజు, గంగరాజు, నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

గోలింగేశ్వరస్వామికి లక్షపత్రి పూజ



నిడదవోలు, మార్చి 17: నిడదవోలులోని శ్రీ రాజరాజేశ్వరి సమేత గోలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నెలవారీ లక్షపత్రి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

కొవ్వూరు, మార్చి 17: అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసున మోదు చేసినట్టు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. కొవ్వూరులోని ఇందిరమ్మకాలనీకి చెందిన ఈద్పుగంటి శ్రీనివాసరావు ఆదివారం అనధికారికంగా బీర్లు విక్రయిస్తుండగా పట్టణ పోలీసులు దాడిచేశారు. అతని వద్ద నుంచి రూ.2400 విలువైన 8 బీరు సీసాలను స్వాధీనం చేసుకుని కేసునమోదు చేశామన్నారు.

ముగిసిన ప్రీమియర్ క్రికెట్ లీగ్

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 17: రాజమహేంద్రవరం మున్సిపల్ కాలనీ క్రీడామైదానంలో జరిగిన 9వ మున్సిపల్ కాలనీ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిసాయి. ఫైనల్ పోటీల్లో రాజా వారియర్స్‌పై దాని కింగ్స్ జట్టు విజయం సాధించింది. విజేతలకు రాజమహేంద్రి విద్యాసంస్థల ఛైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి బహుమతులు అందజేశారు. వైసీపీ నాయకుడు నామాని వాసు, సెక్రటరీ బద్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలి

» టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు
» చిలుకలూరిపేట తరలిన తెలుగుదేశం నాయకులు


కొవ్వూరులో టీడీపీ నాయకుల ర్యాలీకి జెండా ఊపుతున్న ముప్పిడి

కొవ్వూరు, మార్చి 17: రాష్ట్ర భవిష్యత్‌తో పాటు భావితరాల భవితను కాపాడుకోవాలంటే దేశంలోను, రాష్ట్రంలోను ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. చిలుకలూరిపేట ప్రజాగళం సభకు వెళ్తున్న టీడీపీ నాయకుల వాహనాలకు స్థానిక పార్టీ నియోజకవర్గ కార్యాలయం వద్ద ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్‌రెడ్డి అన్నివర్గాల ప్రజలకు హామీలిచ్చి మోసంచేశారని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టేశారని, ఆయనను రాష్ట్రం నుంచి సాగనంపాలని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, నాదెళ్ళ శ్రీరామ్, బేతిన నారాయణ, దాయన రామకృష్ణ, కలగర సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


చాగల్లు నుంచి చిలుకలూరి పేట వెళ్తున్న టీడీపీ నాయకులు

చాగల్లు: చాగల్లు నుంచి టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు నందిగం శ్రీను ఆధ్వర్యంలో పార్టీ నాయకులు చిలుకలూరిపేట వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం బుగుండాలని, ప్రజలకు మేలు జరగాలని బీజేపీ, జనసేనలతో కలిసి టీడీపీ ఎన్నికలకు వెళుతుందని, ప్రజలు ఆశీస్సులు కావాలన్నారు. కార్యక్రమంలో తాళ్లూరి హరిశ్చంద్రప్రసాద్, ఈడుపుగంటి మురళి, సుబ్బారావు, తాళ్లూరి శ్రీనివాసరావు, జొన్నకూటి వెంకాయమ్మ, ఊబా దుర్గ, ఎండీ అల్తాఫ్ అహ్మద్ పాల్గొన్నారు.

యాదవుల సంక్షేమానికి టీడీపీ పెద్దపీట

» యాదవ సంఘీయుల ఆత్మీయ సమావేశంలో పార్టీ నేతలు


సమావేశంలో మాట్లాడుతున్న ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 17: తెలుగుదేశం పార్టీ అంటేనే యాదవులు పార్టీ అని, వారి సంక్షేమానికి కృషి చేస్తూనే ఉంటామని టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, యర్రా వేణుగోపాలరాయుడు అన్నారు. టీడీపీ యాదవ సంఘీయుల ఆత్మీయ సమావేశం రాజమహేంద్రవరం ఆనంద్ రీజెన్సీ పందిరి హాలులో గ్రేటర్ యాదవ సంఘం అధ్యక్షుడు మరుకుర్తి రవియాదవ్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. దీనికి వారు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. తొలుత శ్రీకృష్ణుడి విగ్రహానికి పూలమాల వేశారు. ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ పదవుల్లోను, కార్పొరేటర్ల సీట్లు కేటాయింపుల్లో ఇచ్చిన ప్రాధాన్యాన్ని వివరించారు. టీడీపీ అధికారంలో ఉన్నా లేకపోయినా చంద్రబాబు.. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడుకు అత్యధిక ప్రాధాన్యమిచ్చారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం బీసీలను విస్మరించిందన్నారు. యాదవులు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేలా కృషిచేస్తామన్నారు. అనంతరం ఆదిరెడ్డి వాసును యాదవులు సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కొయ్యన కుమారి, రెడ్డి మణి, బుడ్డిగ రాధా, మిస్కా జోగినాయుడు, కరగాని వేణు, మజ్జి రాంబాబు, కడియాల రాజశేఖర్ పాల్గొన్నారు.

'పది'కి సర్వం సిద్ధం

» నేటి నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు
» ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.40 వరకూ నిర్వహణ


గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

గోపాలపురం, మార్చి 17: ఈ నెల 18వ తేదీ నుంచి జరగబోయే పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్టు మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. గోపాలపురంలో జిల్లా పరిషత్ హైస్కూల్, బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాల, వేళ్లచింతలగూడెంలో సెయింట్ జోసఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, రాజంపాలెంలో జడ్పీ హైస్కూల్, సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్స్‌లో పరీకా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ పరీక్షలు 27వ తేదీ వరకు ఉదయం 9.30గంటలకు నుంచి మధ్యాహ్నం 12.40గంటల వరకూ జరుగుతాయని చెప్పారు. ఒక్కొక్క తరగతి గదిలో 24మంది విద్యార్థులు పరీక్ష రాసేలా ఐదు కేంద్రాల్లో 55 తరగతి గదులను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి గదిలో ఫ్యాన్లు, విద్యుత్‌లైట్లు సిద్ధం చేశామని, పరీక్షల పర్యవేక్షణకు 68మంది ఇన్విజిలేటర్లను నియమించామని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా ఈ ఏడాది 3078 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.

నిడదవోలులో తొమ్మిది పరీక్షా కేంద్రాలు

నిడదవోలు, మార్చి 17: నిడదవోలు పట్టణ, మండలంలో జరగబోయే పదో తరగతి పరీక్షలకు తొమ్మిది పరీక్షా కేంద్రాలు సిద్ధం చేసినట్టు ఎంఈవో గణేష్ తెలిపారు. నిడదవోలులోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో 261 మంది, సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 220 మంది, రవీంద్రభారతీ పాఠశాలలో 217 మంది, మున్సిపల్ పాఠశాల నెం.3లో 200 మంది, నారాయణ పాఠశాలలో 220 మంది, మండలంలోని పురుషోత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 212 మంది, సమిశ్రగూడెం జడ్పీ హైస్కూల్లో 97 మంది, కోరుమామిడి జడ్పీ హైస్కూల్లో 182 మంది, తాడిమళ్ల జడ్పీ హైస్కూల్లో 205 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు.

ఉండ్రాజవరంలో 1102 మంది విద్యార్థులు

ఉండ్రాజవరం, మార్చి 17: ఉండ్రాజవరం మండలంలో ఐదు పరీక్షా కేంద్రాల్లో 1102 మంది విద్యార్థులు ఈనెల 18 నుంచి టెన్త్ పరీక్షలు రాయనున్నట్టు ఎంఈవోలు సక్సేనరాజు, శారదాజోత్స్న తెలిపారు. ఉండ్రాజవరం హైస్కూలులో రెండు కేంద్రాల్లో 402మంది విద్యార్థులు, 28మంది ఇన్విజిలేటర్లు ఉన్నట్టు తెలిపారు. వేలివెన్ను హైస్కూల్లో 240మంది విద్యార్థులకు 12 మంది ఇన్విజిలేటర్లు, శశి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో 240మంది విద్యార్థులకు 13మంది ఇన్విజిలేటర్లు, అన్నపూర్ణ విద్యానికేతన్‌లో 220మంది విద్యార్థులకు 12మంది ఇన్విజిలేటర్లను ప్రభుత్వం నియమించినట్టు ఎంఈవోలు చెప్పారు. ఈ మేరకు పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ప్రజల భవిష్యత్తు కోసం కూటమిని గెలిపిద్దాం

భవిష్యత్తుకు గ్యారెంటీలో ఆదిరెడ్డి శ్రీనివాస్


టీడీపీలో చేరిన నాయకులతో ఆదిరెడ్డి అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 17: ప్రజల భవిష్యత్తు కోసం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి ఓటేద్దామని ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 41వ డివిజన్‌లో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వాసు టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణితో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్‌ను ఓడించకపోతే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. రాజమహేంద్రవరంలో పబ్లిసిటీ స్టార్ మాటలు నమ్మవద్దన్నారు. అతను అవినీతిపరుడని, మన నుంచి అక్రమంగా దోచుకున్న డబ్బులనే ఇప్పుడు పంచడానికి సిద్ధమౌతున్నాడని, అలాంటి వారికి గుణపాఠం చెప్పాలన్నారు.

టీడీపీలో చేరిన న్యాయవాదులు

రాజమహేంద్రవరం 47వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకుడు న్యాయవాది దారా శేషుకుమార్‌తో పాటు పలువురు న్యాయవాదులు ఆదివారం తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక తిలక్‌రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు సమక్షంలో వారంతా పార్టీలోకి చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో న్యాయవాదులు శ్రీనివాస్, శ్రీకిరణ్, దొరబాబు, ఖాదర్, సతీష్ తదితరులున్నారు. తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసి ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని గెలిపించేందుకు కృషి చేయాలని ఆదిరెడ్డి కోరారు. కార్యక్రమంలో సంసాని ప్రసాద్, బేసరి చిన్ని, కవులూరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట తరలిన తెలుగు తమ్ముళ్లు

చిలకలూరిపేట టీడీపీ-జనసేన-బీజేపీ నిర్వహిస్తున్న సభకు రాజమహేంద్రవరం నుంచి కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో తెలుగుతమ్ముళ్లు తరలి వెళ్లారు. స్థానిక తిలక్‌రోడ్డులోని పార్టీ నియోజకవర్గ కార్యాలయం నుంచి ఆదివారం ఉదయం 10 బస్సులు, 150 కార్లులో సుమారు 4వేల మంది వెళ్లారు. ఆయా వాహనాలను వాసు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, ఉప్పులూరి జానకిరామయ్య, మజ్జి రాంబాబు, శెట్టి జగదీష్, మాలే విజయలక్ష్మి, మీసాల నాగమణి, మస్తాన్ చౌదరి, చాపల చిన్నరాజు, చింతపల్లి నాని తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి జిల్లా ఉపాధ్యక్షుడి రాజీనామా

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 17: మాజీ కౌన్సిలర్, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నక్కెళ్ళ బాబూరావు ఆ పార్టీకి రాజీనామా చేశారు. గతంలో తెలుగుదేశం పార్టీలో పనిచేసిన ఆయన వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీలో చేరారు. అయితే ఇప్పుడు వ్యక్తిగత కారణాలతో వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు బాబూరావు తెలిపారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు తన రాజీనామా లేఖను పంపించారు. ఆయన టీడీపీలోకి చేరనున్నారు.

విద్యుత్ వైర్ల సాకుతో చెట్లు నరికివేత

» పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వకుండానే నరికిన వైనం
» పోలీసులకు గుడ్డిగూడెం రైతు ఫిర్యాదు


గుడ్డిగూడెం శివారులో చింతలపూడి కాల్వ గట్టుపై నరికిన తాటిచెట్లు

గోపాలపురం, మార్చి 17: చింతలపూడి-తాడిపూడి కాల్వ నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందకుండానే ఆ ప్రదేశంలో ఉన్న తాడిచెట్లు, ఇతర మారు జాతి చెట్లను విద్యుత్‌లైన్ల సాకుతో విద్యుత్‌శాఖ సిబ్బంది నరికివేశారంటూ గుడ్డిగూడెం గ్రామానికి చెందిన రైతు బేకిరాజు అభిమాన్యరాజు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిపూడి, చింతలపూడి కాల్వలో తనకు చెందిన సుమారు 20 ఎకరాల భూమిని ఇచ్చినట్టు తెలిపారు. ఆ భూమిలో ఉన్న చెట్లకు పరిహారం ఇప్పటికి ఇవ్వలేదన్నారు. అయితే విద్యుత్‌శాఖాధికారులు విద్యుత్ లైన్ల సాకుతో రెండురోజుల క్రితం 70 తాటిచెట్లను, వేప తదితర మారుజాతి చెట్లను నరికి అమ్ముకున్నట్టు తెలిపారు. దీనిపై విద్యుత్ శాఖాధికారులను ప్రశ్నించగా గుడ్డిగూడెం, భీమోలు లైన్‌మ్యాన్‌లు తనపై దాడికి దిగి దుర్భాషలాడారని చెప్పారు. అవసరం లేకుండానే తాడిచెట్లు నరికి, ముక్కలు చేసి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని అభిమాన్యరాజు ఆరోపించారు. దీనిపై గోపాలపురం ఏఈఏ కే.రవిశంకర్‌ను వివరణ కోరగా ఈ సంఘటనకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులు అందలేదని, ఈ విషయంపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి రైతుకు న్యాయం చేస్తానని చెప్పారు.

ఎన్నికల నియమావళిని విధిగా పాటించాలి

» రాజమహేంద్రవరం ఆర్డీవో చైత్రవర్షిణి
» రాజకీయ పార్టీల నాయకులు, వీఆర్వోలతో సమావేశాలు


వివిధ రాజకీయ ప్రతినిధులకు అవగాహన కల్పిస్తున్న ఆర్వో చైత్రవర్షిణి

రాజానగరం, మార్చి 17: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అధికారులు, రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు విధిగా పాటించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రాజమహేంద్రవరం ఆర్డీవో చైత్రవర్షిణి ఆదేశించారు. నియోజకవర్గ కేంద్రమైన రాజానగరం తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వీఆర్వోలకు వేర్వేరు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల నాయకులు ఫ్లెక్సీలను తొలగించాలని సూచించారు. సొంత స్థలాల్లో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు పెట్టుకుంటే తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలన్నారు. రాజకీయ నాయకులు ఎన్నికల నియమ నిబంధలను కచ్చితంగా పాటిస్తూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు సహకరించాలన్నారు. అలాగే ప్రచారాలకు వినియోగించే మైక్‌సెట్ల వాహనాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నియోజకర్గంలోని రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల్లో ఎఫ్ఎస్‌టి, వీఎస్‌టీ, ఎస్‌సీసీ బృందాలకు సంబంధించిన వాహనాలు పర్యటిస్తున్నాయన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో 24/7 కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. 0883-297195; వాట్సాప్ నెంబర్ : 93464 79234ను సంప్రదించవచ్చని చెప్పారు. సమావేశంలో తహశీల్దార్ అబ్దుల్ రెహమాన్ సుల్తానా, ఆర్ఐ సీతారామయ్య, వీఆర్వోలు, ఆయా రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, పోస్టర్లు తొలగించాలి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 17: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, నగరంలో అనుమతులు లేని హోర్డింగ్‌లు, బోర్డులు, పెట్టరాదని, ఫ్లెక్సీలను, పోస్టర్లను తొలగించాలని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. ప్రభుత్వ ఆస్తులపై ఎటువంటి బోర్డులు, పోస్టర్లు ఉండరాదన్నారు. గాంధీజీ, అంబేద్కర్ వంటి జాతీయ నాయకుల విగ్రహాలు తప్ప ఇతర విగ్రహాలన్నింటికి ముసుగులు వేయాలన్నారు. అభ్యర్థులు ఊరేగింపులు, సమావేశాలు నిర్వహించే సమయంలో ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎటువంటి ఉల్లంఘనలు అనుమతించబోమన్నారు. ఈ నెల 17 నుంచి ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, వీడియో సర్వే లెన్స్ టీమ్‌లు, ఇతర బృందాలు నగరంలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు ప్రవర్తనా నియమావళిని పర్యవేక్షిస్తారని కమిషనర్ చెప్పారు. రాజమండ్రి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నగరపాలక సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై ఫోన్ 94940 60060 నెంబరుకు ఫిర్యాదు చేయవచ్చని, అలాగే నగరపాలక సంస్థ ఫేస్‌బుక్, ట్విట్టర్ యాప్ ద్వారా కూడా ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.


పెరవలిలో పోస్టర్లు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

అమలులోకి ఎన్నికల కోడ్

» రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు
» పలుచోట్ల ఫ్లెక్సీలు, పోస్టర్ల తొలగింపు

దేవరపల్లి/పెరవలి, మార్చి 17: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున మండలంలోని ఆయా గ్రామాల్లో రోడ్లపై ఉన్న రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను, ప్రభుత్వ కార్యాలయాల్లో గోడలుకు ఉన్న పోస్టర్‌లను తొలగిస్తున్నారు. రాజకీయ నాయకులు విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు. వైసీపీ రాజమండ్రి ఎంపీ అభ్యర్థి ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్‌లు అలాగే నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థులు శ్రీనివాసనాయుడు, కందుల దుర్గేష్ ఫొటోలు, పోస్టర్‌లు తొలగిస్తున్నారు. ఎన్టీఆర్, రాజీవ్‌గాంధీ, వంగవీటి రంగ తదితర రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తు న్నారు. దేవరపల్లి మండ లంలోని అన్ని గ్రామాల్లో ఫ్లెక్సీలు, ప్రజాప్రతినిధుల విగ్రహాలను కూడా ముసుగులు వేశారు. ఎన్నికల కోడ్ ఎవరైన ఉల్లంగిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల అధికారులు తెలిపారు. దేవరపల్లిలో కార్యదర్శి రవికిషోర్, పంచాయతీ సిబ్బందితో వివిధ పార్టీల ఫ్లెక్సీలు తొలగించారు. ఇదిలా ఉంటే లక్షల రూపాయలు ఖర్చు పెట్టి ఇటీవలె ఏర్పాటు ఫ్లెక్సీలను తొలగిస్తుండడంతో ఆయా పార్టీల నాయకులు లబోదిబోమంటున్నారు.


దేవరపల్లిలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న దృశ్యం

పార్కా.. ప్లే గ్రౌండా!

» అసంపూర్తిగా 'ఐ లవ్ నిడదవోలు' పనులు
» ఆట స్థలంగా మారిన ప్రాంగణం



పనులు నిలిచిపోవడంతో పార్కు ప్రదేశంలో క్రికెట్ ఆడుతున్న దృశ్యం

నిడదవోలు, మార్చి 17: నిడదవోలులోని గణపతి సెంటరులో ఆక్రమణలు తొలగించి సుందరీకరణ పనులు చేపట్టారు. ఎన్నికల కోడ్ వస్తుందనే తొందరలో పనులు పూర్తి కాకుండానే ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు పార్కును ప్రారంభించేశారు. రుడా నిధులతో ఐ లవ్ నిడదవోలు సింబల్‌ను ఏర్పాటు చేసి పార్కును డిజైన్ చేశారు. అయితే పార్కు పనులు పూర్తికాకపోవడంతో ఈ స్థలం కాస్తా ప్లే గ్రౌండుగా మారిపోయింది. ఈ ప్రాంతం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రాంతం. అలాంటి ప్రాంతంలో ఈ పార్కులో చిన్నారుల నుంచి పెద్దల వరకు సాయంత్రం అయితే చాలు క్రికెట్ గ్రౌండుగా మార్చేసి క్రికెట్ ఆడుతున్నారు. ఇలా క్రికెట్ ఆడడం వల్ల వాహనదారులకు బాల్ తగిలి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్ అధికార్లు అసంపూర్తిగా వదిలేసిన పార్కు పనులను చేపట్టి ఇది ప్లే గ్రౌండు కాదు పార్కు అనే విధంగా తయారు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

మహిళల్లో వ్యాధులపై అవగాహన అవసరం

పీఎంపీ అసోసియేషన్ సదస్సులో డాక్టర్ మాధురీదేవి

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి 17: మహిళలకు వచ్చే వ్యాధులపై ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్(పీఎంపీ)కు అవగాహన అవసరమని గైనకాలజిస్టు డాక్టర్ మాధురీదేవి సముద్రాల అన్నారు. కమ్యూనిటీ పారా మెడికల్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన అవగాహనా సదస్సు రాజమండ్రి శాఖ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్‌ఖాన్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధురీస్ విమెన్స్ క్లినిక్ గైనకాలజిస్టు డాక్టర్ మాధురీదేవి మాట్లాడుతూ స్త్రీలు ఇబ్బంది పడే వ్యాధులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి చికిత్స అందించడంతో పాటుగా వ్యాధి గురించి జాగ్రత్తలను స్త్రీలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు, పి.దేవానందం, మట్టా రమేష్, యు.ప్రసాద్‌బాబు, కేవీఎస్ఎన్ రెడ్డి, సుంకర శ్రీనివాస్, ఎమ్.బాషూజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధురీదేవిని సభ్యులు సత్కరించారు.

ఆర్టీసీ బస్టాండు ఆవరణలో చలివేంద్రం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 17: రాజమహేంద్రవరం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా సీఐ అజయ్‌బాబు, అసిస్టెంట్ డీఎం ఎస్ఎం త్రిమూర్తులు, ఏఎస్ఐ రామకృష్ణ, సుగుణ చిల్డ్రన్స్ హాస్పిటల్ డాక్టర్ దుర్గాప్రసాద్ పాల్గొని దీన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు ఉత్తమ మహిళా అవార్డులు అందజేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ, బొల్లిన గంగరాజు జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు (2002-2005) యర్నగూడెం వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సెక్రటరీ బాలకృష్ణ, ప్రసాద్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.